

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 271 | ఎడిటర్ : బరిగెల శివ | మంగళవారం 01, సెప్టెంబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్





## మంత్రివర్గ విస్తరణలో..

# మార్పు తప్పదా !

- తెలంగాణ రాజకీయాల్లో వాడి వేడి చర్చ నడుస్తుంది
- మంత్రి పదవుల కోసం ఆశవాహకులు పెరిగిపోతున్నారు
- పనిచేయని మంత్రులకు ఉద్వాసన తప్పదా
- రాష్ట్ర ప్రయోజనాల్లో సామాజిక న్యాయం ఎక్కడ
- కష్టానికి ఫలితాలు దక్కుతాయా.... నిరుత్సాహాలు ఎదురవుతాయా
- ప్రజాసేవలో టాప్ లీడ్ లో కొనసాగుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, మంత్రి కొండా సురేఖ
- రాష్ట్ర రాజకీయాల్లో వర్గ పోరు ఎక్కువైపోతుంది
- ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలు ఏం నిర్ణయం తీసుకోబోతున్నారు
- రాష్ట్ర ప్రభుత్వ సేవల పట్ల ఆరాతీస్తారా.... ఆదమరుస్తారా...
- రాష్ట్ర ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను ఎలా అధిగమిస్తారు
- పార్టీపై విమర్శలకు, పార్టీకి జరుగుతున్న నష్టానికి ఏం బదిలిస్తారు
- డాక్టర్ బరిగెల శివ

తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఢిల్లీ వేదికగా కాంగ్రెస్ అధిష్టానం రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై సమీక్షకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కీలక మంత్రులు, పార్టీ నేతల ఢిల్లీ పర్యటనలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మంత్రుల పనితీరు, ప్రజల్లో ఉన్న ఆదరణ, పార్టీ బలోపేతంపై అధిష్టానం ఆరా తీయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. పనితీరు ఆశించిన స్థాయిలో లేని మంత్రులకు ఉద్వాసన పలికి, కొత్తవారికి అవకాశం కల్పించే అంశం పరిశీలనలో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ. సామాజిక న్యాయం, ప్రాంతీయ సమతుల్యతకు ప్రాధాన్యం ఇవ్వాలన్న డిమాండ్లు కూడా తెరపైకి వస్తున్నాయి. కష్టపడి పనిచేస్తున్న ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు మంత్రివర్గంలో చోటు దక్కుతుందా అన్న ఆసక్తి నెలకొంది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖల పనితీరుపైనా రాజకీయ చర్చ సాగుతోంది. పార్టీలో అంతర్గత విభేదాలు, వర్గపోరు, ప్రభుత్వంపై వస్తున్న విమర్శలపై అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఉత్కంఠగా మారింది. అసెంబ్లీ సమావేశాలకు ముందా.. తర్వాతా కేబినెట్‌లో మార్పులు జరుగుతాయా అన్న ప్రశ్నకు ఢిల్లీ భేటీల అనంతరం స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది. - హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

2

## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

రీ-సర్వేను వేగవంతం చేయాలి: మంత్రి పొంగులేటి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు గడువులోగా పూర్తి చేయాలి

ప్రతి భూయజమానికి చట్టబద్ధమైన హక్కులు కల్పిస్తాం

అర్హులైన రైతుల భూములను 22-ఏ జాబితా నుంచి తొలగించాలి

రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్, హౌసింగ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలి

6





## కృష్ణా జలాలు తోచుకుపోతుంటే చోద్యం

ప్రభుత్వం తీరుపై మండిపడ్డ హరీష్ రావు

హైదరాబాద్, 31 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)



కృష్ణా జలాలలను ఎపి తరలించుకు పోతున్నా ఇంకెప్పుడు మేల్కొంటారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు మండిపడ్డారు. నీటి కేటాయింపులు లేకున్నా.. వరద జలాలు రాకున్నా.. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఏపీ ప్రభుత్వం బేసిన్ దాటి కృష్ణా జలాలను యథేచ్ఛగా తరలిస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి చోద్యం చూస్తుండటం తెలంగాణకు తీరని ద్రోహమని హరీశ్ రావు మండిపడ్డారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో సాగునీటి కష్టాలు తీవ్రమవుతుంటే.. మరోవైపు ఏపీ ప్రభుత్వం తెలంగాణ నీటి హక్కులపై దండెత్తి కృష్ణా జలాలను అడ్డగోలుగా తరలిస్తోంది. కృష్ణా బేసిన్‌లో భాగమైన భీమా, కల్వకుర్తి, నె÷-టటెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీళ్లు లేక ఆయకట్టలు ఎండిపోతుంటే.. మరోవైపు బేసిన్‌తో సంబంధం లేని ప్రాంతాలకు ఏపీ నిబంధనలు ఉల్లంఘిస్తూ, యథేచ్ఛగా నీటిని తరలిస్తోంది. మాల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, నాగార్జున సాగర్ కుడి కాల్వ.. ఇప్పుడు వెలిగొండ! తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలిస్తున్నా రేవంత్ ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదు? రంగారెడ్డి, పాలమూరు, నల్లగొండ సహా తెలంగాణ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తీరని ద్రోహం ఇది. తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా నీళ్లను మన పొలాలకు మళ్లించాల్సిన సీఎం రేవంత్.. ఏపీకి పరోక్షంగా ఎందుకు సహకరిస్తున్నారు? ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కేఆర్ఎంబీ సైతం పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గం. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన సంస్థే ప్రేక్షకపాత్ర పోషిస్తే.. రాష్ట్ర నీటి హక్కులను ఎవరు కాపాడాలి? కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెంటనే స్పందించాలి. కేఆర్ఎంబీపై ఒత్తిడి తెచ్చి, తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపి, ఆయకట్టుకు నీటి సరఫరా జరిగేలా చూడాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం‘ అని హరీశ్ రావు అన్నారు.



## రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు

హల్ద్వానీ, 31 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సమాచారం. మల్లికార్జున ఖర్గే ర్యాలీ అనంతరం నిర్వహించిన ‘శుద్ధీకరణ’ కార్యక్రమంపై ఆగస్టు 29న జరిగిన మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తమ సామాజిక వర్గం మనోభావాలను దెబ్బతీశాయని ఆరోపిస్తూ వాల్మీకి కమ్యూనిటీకి చెందిన అమిత్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు వాల్మీకి సమాజాన్ని అవమానించేలా ఉన్నాయని, వాటి వల్ల తమ సామాజిక వర్గం మనోభావాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఫిర్యాదును పరిశీలించిన పోలీసులు భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) సెక్షన్లు 196, 299తో పాటు ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం, 1989లోని సెక్షన్ 3(1) కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఈ ఘటనతో ఉత్తరాఖండ్ రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై ఫిర్యాదు, పోలీసులు నమోదు చేసిన కేసు నేపథ్యంలో తదుపరి దర్యాప్తులో పోలీసులు ఏ చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. అయితే ఎఫ్ఐఆర్ నమోదు కావడం ఆరోపణలపై దర్యాప్తు ప్రారంభమైనట్టే తప్ప, ఆరోపణలు నిరూపితమైనట్లు కాదన్నది గమనార్హం.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# మంత్రివర్గ విస్తరణలో మార్పు తప్పదా..!?

**తెలంగాణ రాజకీయాల్లో వాడి వేడి చర్చ నడుస్తుంది**
**మంత్రి పదవుల కోసం ఆశవాహాకులు పెరిగిపోతున్నారు.**
**పనిచేయని మంత్రులకు ఉద్వాసన తప్పదా**
**రాష్ట్ర ప్రయోజనాల్లో సామాజిక న్యాయం ఎక్కడ**
**కష్టానికి ఫలితాలు దక్కుతాయా.... నిరుత్సాహాలు ఎదురవుతాయా**
**ప్రజాసేవలో టాప్ లీడ్ లో కొనసాగుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, మంత్రి కొండా సురేఖ**
**రాష్ట్ర రాజకీయాల్లో వర్గ పోరు ఎక్కువైపోతుంది**
**ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలు ఏం నిర్ణయం తీసుకోబోతున్నారు**
**రాష్ట్ర ప్రభుత్వ సేవల పట్ల ఆరాతీస్తారా.... ఆదమరుస్తారా...**
**రాష్ట్ర ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను ఎలా అధిగమిస్తారు**
**పార్టీపై విమర్శలకు, పార్టీకి జరుగుతున్న నష్టానికి ఏం బదిలిస్తారు : డాక్టర్ బరిగెల శివ**

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయాల పట్ల డిల్లి కాంగ్రెస్ అధిష్టానం కాస్తంత అసంతృప్తిగా ఉన్నట్లు విశ్వాసనీయ సమాచారంగా డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ విశ్లేషకుల అంచనాల ప్రకారం రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో స్వల్ప మార్పులు జరగబోతున్నట్లు భావిస్తూ ఉంటుండగా కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ పెద్దలు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పరిపాలనపై క్షేత్రస్థాయి దృష్టి పెట్టినట్లు తెలుస్తోందన్నారు.ప్రజల అంచనాలను చేరుకోవడంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ విఫలమవుతున్నట్లుగా ప్రజల నుండి ప్రజా సంఘాల నుండి రాజకీయ వర్గాల నుండి మేధావుల నుండి నిరుద్యోగుల నుండి పలు రకాల విమర్శలు వస్తుండగా ఇంచుమించు మూడు సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రయోజనాలపై క్షేత్రస్థాయి సమావేశాలు నిర్వహించే ఆస్కారం ఉన్నట్లు తెలుస్తుంది.తెలంగాణ మంత్రులతో తెలంగాణ ప్రజా ప్రతినిధులతో జాతీయ కాంగ్రెస్ పార్టీ పెద్దలు ఇప్పటివరకు లోతైన సమావేశాలు గానీ లోతైన సమీక్షలు గాని లోతైన చర్చలు గాని జరపలేదని అందువల్లనే తెలంగాణ రాష్ట్రంలో ఇష్టారాజ్యపాలనకు తెరలేపబడిందని ప్రజా సంఘాలు భావిస్తున్నాయన్నారు.కష్ట కాలాలను దాటుకొని అధికారంలోనికి వచ్చిన కాంగ్రెస్ పార్టీపై ప్రజావిశ్వాసం ఏ విధంగా ఉందో పరీక్షించుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తుందన్నారు.ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల పట్ల తెలంగాణ రాష్ట్ర రాజకీయ వైరుధ్యాల పట్ల తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంలోని వర్గపోరు పట్ల ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోందన్నారు.ఏఐసిసి కాంగ్రెస్ పెద్దలతో జరగబోయే అత్యవసర సమావేశాల పట్ల తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తరఫున హాజరుకానున్న ముఖ్యమంత్రి, మంత్రులు, పలువురు ప్రజా ప్రతినిధులు సీనియర్ కాంగ్రెస్ నేతలతో ఏఐసీసీ వర్గాలు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్ తో పాటు ప్రధాన నాయకుడు రాహుల్ గాంధీ మల్లికార్జున ఖర్గే లాంటి నేతలు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాజకీయాల పట్ల నిర్దిష్టమైన సమాచార సేకరణతో సమావేశం నిర్వహించి కష్టపడి పని చేస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు మంత్రులు ఎవరో తెలుసుకుంటూనే, పనిచేయని నాయకులు, మంత్రులు వాళ్ళ జాబితాను సేకరిస్తూ,పనిచేయని మంత్రులకు మంత్రివర్గ పదవుల నుండి ఉద్వాసన పలుకుతూ నూతనంగా ప్రజాసేవ కోసం కష్టపడి పనిచేస్తున్న ప్రజాప్రతినిధులను ఒకరిద్దరిని మంత్రివర్గంలోనికి తీసుకోవడానికి ప్రయత్నాలు సాగుతున్నాయి అంటూ రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తుందన్నారు.తెలంగాణ రాష్ట్రం వ్యాప్తంగా కష్టపడి పని చేస్తున్న నాయకుల పట్ల జరుగుతున్న ఆటంకాలు అవరోధాలు అవమానాలు ఢిల్లీ కాంగ్రెస్ పెద్దల సమక్షంలో బయటకు రానున్నట్లు విశ్వాసనీయ సమాచారం అన్నారు.ఇప్పటికే వేడెక్కిన రాజకీయాలు తెలంగాణలో సర్దుమరిగినప్పటికీని మీడియా ముసుగులో కొంతమంది రాజకీయ ముసుగులో మరికొంతమంది,అధికార పదవులు ఆశిస్తుండడంలో ఇంకొంతమంది కష్టపడి పని చేస్తున్న మంత్రులపై తీవ్రంగా విమర్శలు చేస్తూ పబ్బంగడుపుకుంటున్నారని హెచ్చరించారు.మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి. రాజగోపాల్ రెడ్డి,దేవాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాసేవ కోసం కట్టుబడి పనిచేస్తున్నారని ప్రజల విశ్వాసానికి అనుకూలంగా పనిచేయడంలో ముందు వరుసలో ఉన్నట్లు తెలంగాణ ప్రజల విశ్వాసాన్ని తెలియజేశారు.తెలంగాణ రాజకీయాలను శాసిస్తున్నది ముమ్మాటికీ వ్యాపారస్తులు, ఆంధ్ర సంపన్న మీడియా సంస్థలేనని హెచ్చరించారు.ఢిల్లీలో జరగబోయే తెలంగాణ రాష్ట్ర రాజకీయాల విస్తృత సమావేశాలపై రాజకీయపరమైన వివరాలను విశ్లేషణాత్మకంగా వివరించారు.

**ఢిల్లీ వేదికగా హీటెక్కనున్న తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాలు!**

తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాలు మరోసారి దేశ రాజధాని వేదికగా హాట్ టాపిక్‌గా మారనున్నాయి. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కుటుంబ సమేతంగా విదేశీ పర్యటన ముగించుకుని సోమవారం రాత్రి ఢిల్లీకి చేరుకోనున్నట్లు సమాచారం. రేపటి నుంచి సుమారు వారం రోజుల పాటు ఆయన ఢిల్లీలోనే ఉండనున్న నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలపై కీలక చర్చలు జరగనున్నట్లు ఏఐసీసీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇదే సమయంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కూడా సోమవారం రాత్రి లేదా రేపు ఉదయం ఢిల్లీకి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ఆయన ఢిల్లీలోనే ఉండే అవకాశం ఉందని సమాచారం. మరోవైపు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి డి. శ్రీధర్ బాబు కూడా రేపు ఢిల్లీకి చేరుకోనున్నట్లు తెలుస్తోంది. దీంతో తెలంగాణ కాంగ్రెస్‌కు చెందిన కీలక నేతలంతా ఒకేసారి ఢిల్లీలో ఉండబోతుండటం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

**స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు వైఎస్సార్ అవార్డు**

బుధవారం ఢిల్లీలో జరగనున్న కార్యక్రమంలో స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు వైఎస్ రాజశేఖర రెడ్డి అవార్డు--2026 బహుకరించనున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు కూడా తెలంగాణ కాంగ్రెస్‌కు చెందిన పలువురు ముఖ్య నేతలు ఢిల్లీకి రానున్నారు. ఈ పరిణామాల మధ్య సీఎం రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, మహేష్ కుమార్ గౌడ్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, డి. శ్రీధర్ బాబు, అలాగే తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్తో ఏఐసీసీ అగ్రనేతలు కీలక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**కొండా సురేఖ - చిన్నారెడ్డి వ్యవహారాలపై చర్చ?**

మంత్రి కొండా సురేఖ, సీనియర్ నేత చిన్నారెడ్డికు సంబంధించిన వ్యవహారాలపై ఇప్పటికే పార్టీ అధిష్టానానికి నివేదికలు చేరినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తెలంగాణ కాంగ్రెస్‌లోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నాయకుల అభిప్రాయాలను సేకరించిన అనంతరం సమగ్ర నివేదికను కొద్ది రోజుల క్రితమే పార్టీ అధిష్టానానికి మీనాక్షి నటరాజన్ అందజేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మొత్తం పార్టీ పరిస్థితి, ప్రభుత్వ పనితీరు, నాయకుల మధ్య సమన్వయం, అంతర్గత విభేదాలు తదితర అంశాలపై తెలంగాణ నేతలతో కేసీ వేణుగోపాల్‌తో పాటు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చర్చించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై కీలక నిర్ణయమా?**

ఢిల్లీ సమావేశాల అనంతరం తెలంగాణ కాంగ్రెస్ పార్టీతో పాటు రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలకు సంబంధించి కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉందని ఏఐసీసీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా కేబినెట్ పునర్వ్యవస్థీకరణ తప్పనిసరి కావచ్చనే చర్చ పార్టీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. అయితే, ఈ అంశంపై తుది నిర్ణయం ఎప్పుడు వెలువడుతుందనేది ఆసక్తికరంగా మారింది. 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న తెలంగాణ అసెంబ్లీ సమావేశాలకు ముందే కేబినెట్ పునర్వ్యవస్థీకరణ జరుగుతుందా? లేక అసెంబ్లీ సమావేశాల తర్వాత జరుగుతుందా? అనే విషయంపై రాష్ట్ర నేతలతో జరిగే కీలక సమావేశాల అనంతరమే స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మొత్తానికి రేపటి నుంచి ఢిల్లీ వేదికగా తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాలు మరింత వేడెక్కనున్నాయి. అధిష్టానం నిర్వహించబోయే వరుస భేటీలు, నేతల అభిప్రాయాల సేకరణ, పార్టీ అంతర్గత పరిస్థితులు, కేబినెట్ మార్పులు వంటి అంశాలు రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపులకు దారితీయవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## పిల్లల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతున్న సంఘం



హైదరాబాద్(జై భీమ్ న్యూస్)

బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా బాలల హక్కుల పరిరక్షణ మరియు అభివృద్ధి సంఘం సేవా కార్యక్రమాలను చేపడుతోంది. సమాజంలో చిన్నారులపై జరుగుతున్న హింస,లైంగిక వేధింపులు, హత్యలు,దోపిడీ, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు వంటి సమస్యలపై స్పందిస్తూ, ప్రతి చిన్నారికి సురక్షితమైన భవిష్యత్తు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని సంఘం పేర్కొంది. సంఘం అధ్యక్షులు డాక్టర్ రామ్ నరసింహ గౌడ్ వీరమల్ల ఆధ్వర్యంలో బాలల హక్కులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనాథలు, నిరాశ్రయులు, పేద కుటుంబాలకు చెందిన చిన్నారులకు అవసరమైన సహాయం అందించే దిశగా కూడా కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. చిన్నారులకు విద్య, ఆరోగ్యం, పోషకాహారం, భద్రత వంటి ప్రాథమిక హక్కులు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, బాలలపై హింస, వేధింపులు, దోపిడీ వంటి ఘటనలు వెలుగులోకి వచ్చినప్పుడు వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధిత పిల్లలకు న్యాయం జరిగేలా కృషి చేయనున్నట్లు సంఘం తెలిపింది. అలాగే బాలల సమస్యల పరిష్కారం కోసం సలహా సేవలు, పునరావాస సహాయం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక వర్గాలతో సమన్వయంగా పనిచేస్తూ బాలల సంక్షేమానికి తమ వంతు సేవలు అందించనున్నట్లు పేర్కొంది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు డాక్టర్ రామ్ నరసింహ గౌడ్ వీరమల్ల మాట్లాడుతూ, “పిల్లల హక్కులను కాపాడటం అంటే వారి భవిష్యత్తును కాపాడటమే. ప్రతి చిన్నారి సురక్షితంగా, ఆరోగ్యంగా, విద్యావంతుడిగా ఎదిగేలా సమాజం మొత్తం బాధ్యత తీసుకోవాలి” అని పిలుపునిచ్చారు.

## ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయం: ఎమ్మెల్సీ మల్క కొమరయ్య

**ఘనంగా డాక్టర్ సూరం విష్ణువర్ధన్‌రెడ్డి ఉద్యోగ విరమణ అభినందన సభ**



హైద్రాబాద్, 31 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, వారు అందించే సేవలు చిరస్మరణీయమని బీజేపీ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య అన్నారు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను బోధించడం మాత్రమే కాకుండా, వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం తాళ్లపల్లిలోని జెడ్పీహెచ్ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూరం విష్ణువర్ధన్‌రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం నిర్వహించిన అభినందన సభకు ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డిని ఘనంగా సన్మానించి, ఆయన సేవలను కొనియాడారు. మల్క కొమరయ్య మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి కేవలం ఉద్యోగం కాదని, సమాజం పట్ల బాధ్యతతో కూడిన సేవ అని అన్నారు. ఒక తరం భవిష్యత్తును తీర్చిదిద్దే మహత్తర అవకాశం ఉపాధ్యాయులకు లభిస్తుందని పేర్కొన్నారు. ఆ బాధ్యతను డాక్టర్ సూరం విష్ణువర్ధన్‌రెడ్డి నిబద్ధత, క్రమశిక్షణ, అంకితభావంతో సమర్థవంతంగా నిర్వర్తించారని ప్రశంసించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడం, లక్ష్యాలను సాధించడం, మంచి పౌరులుగా ఎదగడం వంటి విలువలను కూడా ఆయన బోధించారని అన్నారు. ఆయన వద్ద విద్యనభ్యసించిన పలువురు విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో కొనసాగుతుండటం ఆయన విద్యా సేవలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఉద్యోగ బాధ్యతల నుంచి పదవీ విరమణ చేసినా.. ఉపాధ్యాయుడిగా ఆయన చూపిన ప్రభావానికి పదవీ విరమణ ఉండదని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య అన్నారు. విద్యార్థుల జీవితాల్లో డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి నాటిన జ్ఞానపు విత్తనాలు భవిష్యత్తులోనూ మంచి ఫలాలను అందిస్తాయని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పాల్గొని డాక్టర్ సూరం విష్ణువర్ధన్‌రెడ్డికి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కేఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ



**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**

వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం రాంనగర్ గ్రామానికి చెందిన పోలేమోని వెంకటయ్య తండ్రి పోలేమోని చిన్న రామయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. ఈ విషయాన్ని రాంనగర్ గ్రామస్థుల ద్వారా తెలుసుకున్న కెఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ. వారి కుటుంబాన్ని పరామర్శించి రామయ్యకు నివాళులర్పించారు. వెంకటయ్య కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పిస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## చెల్లి.. బుజ్జి అంటూ వివాహితతో కానిస్టేబుల్ సన్నిహిత సంబంధం?

**కోర్టు కేసు విచారణకు వచ్చిన మహిళతో పరిచయం.. భర్తకు అనుమానం రావడంతో నిఘా**


ఖమ్మం, 31 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)

కోర్టు కేసు విచారణ నిమిత్తం వచ్చిన ఓ వివాహిత మహిళతో పోలీస్ కానిస్టేబుల్ సన్నిహితంగా మెలిగినట్లు ఆరోపణలు ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో కలకలం రేపుతున్నాయి. బాంబ్ స్క్వాడ్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ రాంబాబు.. సదరు మహిళను ‘చెల్లి’, ‘బుజ్జి’ అంటూ పరిచయం పెంచుకుని, అనంతరం సన్నిహిత సంబంధం కొనసాగించినట్లు ఆమె భర్త ఆరోపిస్తున్నాడు. కేసు విచారణ కోసం కోర్టుకు వస్తున్న క్రమంలో కానిస్టేబుల్‌తో తన భార్యకు పరిచయం ఏర్పడిందని, ఆ పరిచయం క్రమంగా సన్నిహిత సంబంధానికి దారితీసిందని భర్త పేర్కొన్నాడు. భార్య ప్రవర్తనపై అనుమానం రావడంతో కొంతకాలంగా ఆమెపై నిఘా పెట్టినట్లు తెలిపాడు. ఈ క్రమంలో తన భార్యతో కానిస్టేబుల్ ఏకాంతంగా ఉన్న సమయంలో తాను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నానని భర్త ఆరోపించాడు. గతంలో కూడా ఇద్దరూ ఏకాంతంగా ఉన్న సందర్భాలకు సంబంధించిన వీడియోలు తన భార్య ఫోన్‌లో ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నాడు. అయితే వారిని పట్టుకున్న సమయంలో కానిస్టేబుల్ తనపై దాడి చేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడని భర్త ఆరోపించాడు. తనకు, తన భార్యకు సుమారు పదేళ్లుగా ప్రేమ, వివాహ బంధం కొనసాగుతోందని, తమకు ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపాడు. కేసు విషయంలో పోలీస్‌స్టేషన్, కోర్టులకు వచ్చే మహిళతో ఓ పోలీసు అధికారి ఈ విధంగా పరిచయం పెంచుకోవడం, ఆ పరిచయాన్ని దుర్వినియోగం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించాడు. ఈ వ్యవహారంపై పోలీస్ ఉన్నతాధికారులకు భర్త ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కానిస్టేబుల్‌పై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, బాధ్యతాయుతమైన పోలీసు సిబ్బంది ప్రజలతో వ్యవహరించే విషయంలో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరుతున్నాడు. కాగా.. ఈ ఘటనకు సంబంధించి వచ్చిన ఆరోపణలు, వీడియోల నిజానిజాలు, ఘటనలో అసలు ఏం జరిగిందన్న విషయాలపై అధికారిక విచారణ అనంతరం పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.



## తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్‌కు శ్రీధర్ సారథ్యం

హైద్రాబాద్, 31 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)



తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ అధ్యక్షుడిగా సీనియర్ ఫార్మసిస్ట్ శ్రీధర్ ఎన్నికయ్యారు. ఫార్మసీ రిటైల్ రంగంతో పాటు పరిశ్రమలోనూ మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉన్న ఆయనకు కౌన్సిల్ పగ్గాలు దక్కడం పట్ల ఫార్మసీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25 వేల ఫార్మసీలు ఉన్న నేపథ్యంలో శ్రీధర్‌కు లభించిన ఈ బాధ్యతకు ప్రాధాన్యం ఏర్పడింది. 1990వ దశకంలో ‘మిత్ర మెడికల్స్’తో తన వృత్తి ప్రస్థానాన్ని ప్రారంభించిన శ్రీధర్.. అనంతరం ఆధునిక సదుపాయాలతో కూడిన పెద్ద ఫార్మసీ స్టోర్ల అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించారు. ‘ఫార్మా మాల్’ కాన్సెప్ట్‌ను ముందుకు తీసుకెళ్లడంలోనూ ఆయన పాత్ర ఉంది. ప్రస్తుతం మెడిసిన్ ఫార్మసీతో అనుబంధంగా ఉన్న ఆయన.. సంస్థ విస్తరణలో భాగంగా 8కుపైగా పెద్ద ఫార్మసీ స్టోర్ల నిర్వహణలో భాగస్వామిగా కొనసాగుతున్నారు. రిటైల్ రంగంలోని సమస్యల పరిష్కారానికి కూడా శ్రీధర్ సుదీర్ఘంగా కృషి చేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయన.. కెమిస్టులు, ఫార్మసీ రిటైలర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, వృత్తిపరమైన ప్రమాణాలు, ఫార్మసీ సేవల నాణ్యత వంటి అంశాలపై పనిచేస్తున్నారు. గతంలో గ్రేటర్ హైదరాబాద్ మెడికల్ రిటైల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. ఈ సంస్థ సుమారు 5,500 ఫార్మసీలకు ప్రాతినిధ్యం వహించింది. ఆధునిక ఫార్మసీ స్టోర్ల అభివృద్ధి, రిటైల్ రంగంలో ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ‘బెస్ట్ ఫార్మసీ’ అవార్డు కూడా లభించింది. ప్రస్తుతం తెలంగాణలో సుమారు 25 వేల ఫార్మసీలు ఉన్న నేపథ్యంలో కౌన్సిల్ అధ్యక్షుడిగా శ్రీధర్ ఎన్నిక కావడం ఫార్మసీ రంగంలో కీలక పరిణామంగా భావిస్తున్నారు. క్షేత్రస్థాయి సమస్యలపై ప్రత్యక్ష అవగాహన ఉన్న ఆయన.. ఫార్మసిస్టుల ప్రయోజనాలు, వృత్తిపరమైన ప్రమాణాలు, ఫార్మసీ ప్రాక్టీస్, సేవల నాణ్యతతో పాటు సంబంధిత విధానాలపై మరింత దృష్టి సారించే అవకాశం ఉందని ఫార్మసీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రజలకు నాణ్యమైన ఫార్మసీ సేవలు అందేలా ప్రమాణాలను బలోపేతం చేయడంతో పాటు ఫార్మసిస్టుల వృత్తి అభివృద్ధికి శ్రీధర్ అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుందని పరిశ్రమ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# ఎల్కతుర్తిలో రాత్రివేళ మొరం దందా?

**విచ్చలవిడిగా తవ్వకాలు.. భారీ క్వారీగా మారుతున్న భూములు!**
**స్థానిక పోలీస్, మైనింగ్ అధికారుల పాత్రపైనా అనుమానాలు..**
**జిల్లా స్థాయి అధికారుల ఆకస్మిక తనిఖీలకు స్థానిక ప్రజల డిమాండ్**

**ఎల్కతుర్తి ఆగస్టు 31(జై భీమ్ న్యూస్):**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో మట్టి, మొరం తవ్వకాలు, అక్రమ రవాణాపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో యంత్రాలతో పెద్దఎత్తున తవ్వకాలు చేపట్టి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా మొరం తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొంతకాలంగా ఇదే విధంగా తవ్వకాలు కొనసాగడంతో ఓ ప్రాంతం భారీ క్వారీని తలపించే స్థాయికి చేరుకుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### రాత్రివేళల్లోనే ఎందుకు?

పగటి వేళల్లో సాధారణంగా కనిపించకుండా రాత్రి సమయంలో తవ్వకాలు, రవాణా జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. భారీ యంత్రాల శబ్దాలు, టిప్పర్లు, ట్రాక్టర్ల రాకపోకలతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటున్నారు. రాత్రివేళల్లో అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తే అసలు పరిస్థితి వెలుగులోకి వస్తుందని వారు అంటున్నారు.

### భారీ గుంతలతో ప్రమాదం పొంచి ఉందా?

అనుమతులు ఉన్నా లేకపోయినా భారీ స్థాయిలో మట్టి, మొరం తవ్వకాలు జరిగితే ఏర్పడే లోతైన గుంతలు భవిష్యత్‌లో ప్రమాదాలకు కారణమయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువులు, చిన్నారులు, రైతులు ప్రమాదానికి గురయ్యే పరిస్థితి ఏర్పడకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని అధికారులు స్వయంగా పరిశీలించి భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

### అనుమతులు ఉన్నాయా?

తవ్వకాలకు సంబంధిత శాఖల నుంచి అనుమతులు ఉన్నాయా? ఉంటే ఎంత పరిమాణంలో తవ్వుకునేందుకు అనుమతి ఇచ్చారు? అనుమతించిన పరిమితికి మించి తవ్వకాలు జరుగుతున్నాయా? తవ్విన మొరాన్ని ఎక్కడికి తరలిస్తున్నారు? రవాణా చేస్తున్న వాహనాలకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.




### అధికారుల పాత్రపై అనుమానాలు

ఈ వ్యవహారంలో స్థానిక పోలీస్ స్టేషన్‌కు చెందిన కొందరు సిబ్బంది, మైనింగ్ శాఖకు చెందిన ఒక అధికారి పాత్రపై కూడా స్థానికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు అధికారులు అక్రమ రవాణాదారులకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, వాటిపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు. ఆరోపణలు నిజమా కాదా తేల్చేందుకు జిల్లా స్థాయి అధికారులతో నిష్పాక్షిక విచారణ జరిపించాలని స్థానికులు కోరుతున్నారు.

### స్థానిక అధికారులకు సమాచారం చేరకముందే తనిఖీలు చేయాలంటున్న ప్రజలు

రాత్రివేళల్లో కార్యకలాపాలు జరుగుతున్న సమయంలో స్థానిక స్థాయిలో సమాచారం ముందుగానే చేరితే తనిఖీలు ఫలించకపోవచ్చనే అనుమానాలను కొందరు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల స్థానిక యంత్రాంగానికి ముందస్తు సమాచారం లేకుండా జిల్లా స్థాయి ప్రత్యేక బృందంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని వారు కోరుతున్నారు.

### జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలి

ఎల్కతుర్తి మండలంలో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న మట్టి, మొరం తవ్వకాలు, రవాణాపై హనుమకొండ జిల్లా కలెక్టర్, జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, మైనింగ్ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి తవ్వకాల ప్రదేశాలను పరిశీలించాలని, వాహనాల పత్రాలను తనిఖీ చేయాలని, అనుమతుల పరిధిని పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు విచారణలో తేలితే సంబంధిత వ్యక్తులు, వాహన యజమానులు, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. అదే సమయంలో అధికారులపై వస్తున్న ఆరోపణలపైనా నిష్పాక్షిక విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేస్తున్నారు. "జిల్లా స్థాయి అధికారులు ఒక్కసారి రాత్రివేళల్లో ఆకస్మికంగా తనిఖీ చేస్తే అసలు విషయం బయటపడుతుంది. ప్రజల భద్రత, ప్రభుత్వ ఆదాయం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా వెంటనే చర్యలు తీసుకోవాలి" అని స్థానికులు కోరుతున్నారు.

# జర్మనీ రూట్లింగెన్ విశ్వవిద్యాలయంతో.. కాకతీయ యూనివర్సిటీ ఒప్పందం

**విద్యార్థులకు అంతర్జాతీయ ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలకు బాట**

**హన్మకొండ, 31 అగస్టు 2026(జై భీమ్ న్యూస్**



తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దార్శనికతకు అనుగుణంగా రాష్ట్ర విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ఉన్నత విద్యా అవకాశాలను అందించేందుకు కాకతీయ విశ్వవిద్యాలయం మరో కీలక ముందడుగు వేసింది. జర్మనీలోని రూట్లింగెన్ విశ్వవిద్యాలయంతో కాకతీయ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి యోగితా రాణా, ఐఏఎస్‌తో కలిసి జర్మనీ పర్యటనలో భాగంగా రూట్లింగెన్ విశ్వవిద్యాలయ ప్రతినిధులతో ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. అనంతరం హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అవగాహన ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి సమక్షంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ వి. రామచంద్రం, రూట్లింగెన్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ బ్రూనే జోచెన్, స్టెఫాన్ డెగ్లెమాన్ ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. జర్మనీ ప్రతినిధులు ఆన్‌లైన్ ద్వారా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ఒప్పందంలో భాగంగా కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థులకు 3ం2 విద్యా విధానం ద్వారా జర్మనీలో మాస్టర్స్ విద్యను కొనసాగించే అవకాశం లభించనుంది. విద్యార్థులు మొదటి మూడు సంవత్సరాల విద్యను కాకతీయ విశ్వవిద్యాలయంలో పూర్తి చేసి, తదుపరి రెండేళ్ల మాస్టర్స్ విద్యను రూట్లింగెన్ విశ్వవిద్యాలయంలో అభ్యసించవచ్చు. మూడు సంవత్సరాల విద్యను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు కాకతీయ విశ్వవిద్యాలయం డిగ్రీ, అనంతరం రూట్లింగెన్ విశ్వవిద్యాలయం మాస్టర్స్ డిగ్రీ అందించనుంది. కంప్యూటర్ శాస్త్రం, కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాస ఇంజినీరింగ్ విభాగాల విద్యార్థులకు వృత్తిపరమైన సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ కోర్సు అభ్యసించే అవకాశం కల్పించనున్నారు. ఇతర విభాగాల విద్యార్థులకు డిజిటల్ వ్యాపార నిర్వహణలో మాస్టర్స్ వంటి కోర్సుల్లో ఉన్నత విద్యను కొనసాగించే అవకాశం లభించనుంది. ఈ కార్యక్రమం ద్వారా కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి 20 మంది విద్యార్థులను ప్రతిభతో పాటు రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక చేయనున్నారు. ఎంపికైన విద్యార్థులకు విశ్వవిద్యాలయం పాక్షిక ఆర్థిక సహకారం అందించనుంది. తద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ఉన్నత విద్యను అభ్యసించడంతో పాటు జర్మనీలో భవిష్యత్ ఉపాధి అవకాశాలను పొందేందుకు మార్గం సుగమం కానుంది. జర్మనీలో ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా విద్యార్థులు అంతర్జాతీయ విద్యా ప్రమాణాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను అందిపుచ్చుకునే అవకాశం పొందనున్నారు. ఈ ఒప్పందం కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థులకు అంతర్జాతీయ విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలకు కొత్త మార్గాలను తెరవనుందని విశ్వవిద్యాలయ వర్గాలు పేర్కొన్నాయి. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కుమార్ సమక్షంలో నిర్వహించారు. రూట్లింగెన్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ బ్రూనే జోచెన్, స్టెఫాన్ డెగ్లెమాన్ ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయం ప్రత్యేక విధుల అధికారి ఆచార్య వెంకట్రామ్ రెడ్డి, ఆర్‌యూఎస్ఏ నోడల్ అధికారి ఆచార్య మల్లికార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ బాధితురాలికి ఎంపీ కడియం కావ్య అండ

**పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి రూ.2.50 లక్షల ఆర్థిక సాయం**

**హనుమకొండ, 31 ఆగస్టు 2026 ( జై భీమ్ న్యూస్)**

క్యాన్సర్ చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నామిలిగొండకు చెందిన సదాల సంతోషికి ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (గ్రావీచీ=ఖీ) నుంచి మంజూరైన రూ.2.50 లక్షల ఆర్థిక సహాయాన్ని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అందజేశారు. సదాల సంతోషికి చికిత్స కోసం ఆర్థిక సహాయం అవసరమన్న విషయం తన దృష్టికి వచ్చిన వెంటనే ఎంపీ కడియం కావ్య స్పందించారు. పీఎంఎన్ఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందేలా చొరవ తీసుకోవడంతో రూ.2.50 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని, ఆర్థిక ఇబ్బందులతో చికిత్స పొందలేని వారికి ప్రభుత్వ సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. క్యాన్సర్ చికిత్సకు ఆర్థిక సహాయం అందేలా చొరవ చూపిన ఎంపీ కడియం కావ్యకు సదాల సంతోషి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# అనారోగ్యంతో మావోయిస్టు అగ్రనేత రాదక్క మృతి

**ఆదిలాబాద్ నుంచి శివప్ప ముదిరాజ్**





**ఆదిలాబాద్, 31 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

మావోయిస్టు అగ్రనేత మోతిబాయి అలియాస్ రాదక్క (65) అనారోగ్యంతో సోమవారం సాయంత్రం ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఇటీవల చికిత్స కోసం రిమ్స్‌లో చేరారు. ఆదిలాబాద్ మండలం పిప్పల్‌ధారి గ్రామానికి చెందిన రాదక్క.. జిల్లాలో పీపుల్స్ వార్ ఉద్యమం ఉధృతంగా సాగిన సమయంలో తొలితరం నాయకుల్లో ఒకరిగా ఎదిగారు. గ్రామంలోని భూస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా ఉద్యమంలోకి ప్రవేశించి, తొలుత శంకరన్న నాయకత్వంలోని పిప్పల్‌ధారి దళంలో చేరారు. అనంతరం ఇంద్రవెల్లి దళ కమాండర్‌గా, మంగి ఏరియా కార్యదర్శిగా, ఆదిలాబాద్ జిల్లా కమిటీ సభ్యురాలిగా పనిచేశారు. మావోయిస్టు పార్టీ ఏర్పడిన తర్వాత ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలిగా బాధ్యతలు చేపట్టారు. తెలంగాణలో పార్టీపై నిర్బంధం పెరగడంతో ఆమెను దండకారణ్యానికి తరలించినట్లు తెలుస్తోంది. ఇంద్రవెల్లి దళం, మంగి ఏరియాలో పనిచేసిన సమయంలో ఆదిలాబాద్ జిల్లా పీపుల్స్ గెరిల్లా ఆర్మీ కమాండర్‌గా ఉన్న పుల్లూరి ప్రసాద్‌రావు అలియాస్ చంద్రన్నను వివాహం చేసుకున్నారు. చంద్రన్న అనంతరం మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా పనిచేసి ఆయుధాలు వదిలి పోలీసుల ఎదుట లొంగిపోయారు. సుమారు ఐదేళ్ల క్రితం దంతేవాడ ప్రాంతం నుంచి చికిత్స కోసం ఖమ్మం వస్తుండగా పోలీసులు రాదక్కను అరెస్ట్ చేశారు. అనంతరం బెయిల్‌పై విడుదలైన ఆమె సాధారణ జీవితం గడుపుతూ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కొమరం భీం కాలనీలో నివసిస్తున్నట్లు సమాచారం. ఇటీవల చంద్రన్న లొంగిపోవడంతో రామగుండంలో ఉన్న ఆయనను కొంతకాలం రాదక్క కలిసినట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి సమీపంలోని పిప్పల్‌ధారి గ్రామం నుంచి మావోయిస్టు ఉద్యమంలో అగ్రనేత స్థాయికి ఎదిగిన రాదక్క మృతిపై పలు విప్లవ సంఘాల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

# పాఠశాలా..? లేక పిల్లల ఆరోగ్యంతో చెలగాటమాడే కేంద్రామా..?

**ముగిగిపోయిన గుడ్లు.. నాణ్యత లేని కూరగాయల ఆరోపణలు..**
**ఉపాధ్యాయుల కొరత.. విద్యార్థులతో పనులు చేయిస్తున్నారనే విమర్శలు**

**ఐనవోలు, 31 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**



హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం రెడ్డిపాలెంలోని సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలపై తల్లిదండ్రులు, స్థానికుల నుంచి పలు తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థులకు అందిస్తున్న ఆహారంలో ముగిగిపోయిన గుడ్లు, నాణ్యత లేని కూరగాయలు వినియోగిస్తున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. పిల్లలకు పోషకాహారం అందించాల్సిన పాఠశాలలో ఆహార నాణ్యతపై అనుమానాలు వ్యక్తం కావడం పట్ల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల కడుపులోకి వెళ్లే ప్రతి ఆహార పదార్థం నాణ్యమైనదేనా, ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడు ఎవరు తనిఖీ చేస్తున్నారు, వాటి నాణ్యతను ఎలా నిర్ధారిస్తున్నారు అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముగిగిపోయిన గుడ్లు విద్యార్థులకు అందిస్తున్నారనే ఆరోపణల్లో వాస్తవమెంత అనేది సంబంధిత అధికారులు విచారణ ద్వారా తేల్చాల్సిన అవసరం ఉంది. ఇదే సమయంలో పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని, విద్యార్థుల చదువుపై దాని ప్రభావం పడుతోందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రతి సబ్జెక్టుకు తగినంత మంది ఉపాధ్యాయులు ఉన్నారా, ఉపాధ్యాయుల కొరత ఉంటే విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎవరు బాధ్యత వహిస్తారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా విద్యార్థులతో పాఠశాలకు సంబంధించిన పలు పనులు చేయిస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. విద్యార్థుల ప్రధాన బాధ్యత చదువుకోవడమే తప్ప పాఠశాల పనులు చేయడం కాదని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. చిన్నారుల ఆరోగ్యం, భద్రత, విద్య విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా సంబంధిత విద్యాశాఖ అధికారులు పాఠశాలను తక్షణమే తనిఖీ చేసి ఆహార పదార్థాల నాణ్యత, వంటశాల పరిశుభ్రత, ఆహార నిల్వలు, ఉపాధ్యాయుల అందుబాటు, విద్యార్థులతో పనులు చేయిస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణల్లో వాస్తవం ఉంటే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు అవాస్తవమైతే పాఠశాల యాజమాన్యం స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. పిల్లల ఆరోగ్యంతో రాజీ పడకుండా, వారి చదువుతో చెలగాటం ఆడకుండా అధికారులు వాస్తవాలను వెలికి తీసి అవసరమైన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణల్లో నిజమెంత..? పాఠశాల యాజమాన్యం సమాధానం ఏమిటి..? అధికారులు ఎప్పుడు స్పందిస్తారు..? అనే ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది.

# మూడేళ్ల నిబంధనకు మంగళం!

**బల్దియాలో పోస్టింగ్‌ల కోసం ముడుపుల దందా?**
**ఏళ్లుగా ఒకే స్థానంలో ఆర్ఐలు, స్థానచలనం లేకుండా పైరవీలు?**
**రూ.2 లక్షల వరకు వసూళ్ల ఆరోపణలు , కీలక పోస్టింగులపై తీవ్ర విమర్శలు**
**క్రిమినల్ కేసులు ఉన్నవారికి పోస్టింగులు ఎలా వచ్చాయి?**
**కమిషనర్ జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరపాలంటున్న ఉద్యోగ వర్గాలు**




**వరంగల్, 31 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ నిబంధనలు ఒకవైపు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న తీరొకవైపు అన్న చర్చ ఉద్యోగ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఒక ఉద్యోగి ఒకే పోస్టులో మూడు సంవత్సరాలకు మించి కొనసాగకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ, బల్దియాలో కొందరు ఉద్యోగులు ఏళ్ల తరబడి ఒకే స్థానంలో కొనసాగుతున్నారన్న ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ముఖ్యంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఐలు) ఒకే పోస్టులో సుదీర్ఘకాలంగా కొనసాగుతుండటంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మూడు సంవత్సరాల కాలపరిమితి పూర్తయిన తర్వాత పరిపాలనా పరంగా స్థానచలనం చేయాల్సి ఉన్నా, కొందరికి మాత్రం ఆ నిబంధన వర్తించడంలేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**పోస్టింగ్ కదలకుండా పైరవీలు?**

తమకు అనుకూలమైన పోస్టింగులు కొనసాగించుకునేందుకు కొందరు ఉద్యోగులు పైరవీలు చేసినట్లు, ఇందుకోసం ఓ ఉన్నతాధికారికి భారీగా ముడుపులు అందజేసినట్లు విశ్వసనీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఒక్కొక్కరి నుంచి సుమారు రూ. 2 లక్షల వరకు వసూలు చేసినట్లు వినిపిస్తున్న ఆరోపణలు మరింత చర్చనీయాంశంగా మారాయి. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంత? ఎవరి ద్వారా ఈ వ్యవహారం నడిచింది? ఆర్థిక లావాదేవీలు జరిగాయా? అన్నది అధికారిక విచారణలో తేలాల్సి ఉంది.

**క్రిమినల్ కేసులు ఉన్నవారికి కీలక పోస్టింగులా?**

ఇక గతంలో పనిచేసిన ఓ సూపరింటెండెంట్ హయాంలో క్రిమినల్ కేసులు ఉన్న కొందరు ఆర్ఐలకు కీలక పోస్టింగులు ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేసులు పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులకు కీలక బాధ్యతలు అప్పగించే ముందు సంబంధిత రికార్డులను పరిశీలించారా? పోలీస్ వెరిఫికేషన్ జరిగిందా? శాఖాపరమైన నిబంధనలు పాటించారా? అనే ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి.

**రికార్డులు బయటకు తీస్తే అసలు విషయం తేలుతుందా?**

ఏ ఉద్యోగి ఎప్పుడు ఏ పోస్టులో చేరారు? ఎంతకాలంగా అక్కడే కొనసాగుతున్నారు? వారి బదిలీలు ఎప్పుడు జరిగాయి? ఎవరి ఆదేశాలతో పోస్టింగులు కొనసాగించారు? అనే వివరాలను పరిశీలిస్తే వ్యవహారంలో నిజానిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అదేవిధంగా బదిలీ ఉత్తర్వులు, పోస్టింగ్ ఆర్డర్లు, విధుల కేటాయింపులు, సర్వీస్ రికార్డులు, సంబంధిత ఉద్యోగులపై ఉన్న కేసుల వివరాలను పరిశీలించాలని ఉద్యోగ వర్గాలు కోరుతున్నాయి.

**కమిషనర్ జోక్యంపై ఆశలు**

ఈ వ్యవహారంపై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర విచారణకు ఆదేశించాలని ఉద్యోగ వర్గాల్లో డిమాండ్ వినిపిస్తోంది. మూడు సంవత్సరాల నిబంధన ఎందుకు అమలు కాలేదు? ఏళ్ల తరబడి ఒకే పోస్టులో కొనసాగుతున్న ఉద్యోగుల వెనుక కారణాలేమిటి? పోస్టింగ్‌ల కోసం నిజంగానే ఆర్థిక లావాదేవీలు జరిగాయా? క్రిమినల్ కేసులు ఉన్న ఉద్యోగులకు నిబంధనలకు విరుద్ధంగా కీలక పోస్టింగులు ఇచ్చారా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిగితే అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఆరోపణల్లో వాస్తవం ఉన్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఆర్థిక లావాదేవీలపై కూడా దర్యాప్తు జరపాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# పేదల గుడిసెలకు పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

## స్థానిక సమస్యలు పరిష్కరించాలి.. కలెక్టరేట్ ఎదుట సీపీఎం ధర్నా





**హన్మకొండ, 31 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

ఏళ్ల తరబడి గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు పట్టాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, నగరంలో పేరుకుపోయిన చెత్త, డ్రైనేజీ, రోడ్ల సమస్యలను పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. ధర్నాకు సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మంద సంపత్ అధ్యక్షత వహించగా, జిల్లా కార్యదర్శి జి. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అనేక సంవత్సరాలుగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్న గుడిసెవాసులకు పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత నెల రోజులుగా సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై సర్వేలు నిర్వహించామని, వాటి పరిష్కారం కోసం ధర్నా చేపట్టినట్లు తెలిపారు. నగరంలోని అనేక కాలనీల్లో చెత్త, డ్రైనేజీ, రోడ్ల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, ప్రజలకు హౌస్ హోల్డర్ నంబర్లు మాత్రమే కాకుండా వ్యక్తిగత ఇంటి నంబర్లు కేటాయించాలని కోరారు. అర్హులైన వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఆసరా నూతన పింఛన్లు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నూతన పింఛన్ల దరఖాస్తులకు గడువు విధించకుండా, అర్హులైన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకునేలా ప్రభుత్వ విధానాన్ని మార్చాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. వికలాంగుల పింఛన్‌ను రూ.4,016 నుంచి రూ.6,000కు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళల పింఛన్లను రూ.2,016 నుంచి రూ.4,000కు పెంచుతామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కొత్త కొత్త వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు ఎల్లకాలం కొనసాగవని అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రజలను సమీకరించి రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ ధర్నాలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొట్ల చక్రపాణి, జిల్లా కమిటీ సభ్యులు గొడుగు వెంకట్, డి. తిరుపతి, నాయకులు మంద మల్లేశం, వల్లెపు రాజు, మంద శ్రీకాంత్, ఎం. రమాదేవి, సముద్రాల అనిల్, ఇ. రవీందర్, పొట్లపల్లి రాజు, పకిడే రాణి, జగనాల ఉప్పులయ్య, యజ్ఞం స్రవంతి, మనోహర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 136 దరఖాస్తులు

**రెవెన్యూ, జీడబ్ల్యూఎంసీ, హౌసింగ్ సమస్యలపై అధిక వినతులు**





**వరంగల్, 31 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో వినతులు అందాయి. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఐఏఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం 136 దరఖాస్తులు అందగా, వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 42, జీడబ్ల్యూఎంసీకి 26, హౌసింగ్ శాఖకు 21, డీఆర్డీవోకు 16, ఇతర శాఖలకు సంబంధించి 31 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రధానంగా రెవెన్యూ, హౌసింగ్, జీడబ్ల్యూఎంసీ, డీఆర్డీవో పరిధిలోని సమస్యలపై అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చినట్లు అదనపు కలెక్టర్ వై.వి. గణేష్ తెలిపారు. ప్రజల నుంచి అందిన వినతులను సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేసి, వాటిని త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సౌకర్యార్థం ప్రజావాణి కార్యక్రమాన్ని ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. సమస్యల పరిష్కారానికి అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డీఆర్డీవో నాగ పద్మజ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు.

# ప్రజల్లో ఆరోగ్య అవగాహనకు అశోక్‌రెడ్డి సేవలు అభినందనీయం

**డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.అప్పయ్య**
**వైద్య ఆరోగ్య శాఖలో 41 ఏళ్ల పాటు అంకితభావంతో సేవలు**
**హనుమకొండ డీఈఎంఓ వేముల అశోక్‌రెడ్డికి ఘనంగా పదవీ విరమణ సన్మానం**



**హన్మకొండ, 31 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

వైద్య ఆరోగ్య శాఖలో 41 సంవత్సరాల పాటు అంకితభావంతో సేవలందించిన హనుమకొండ జిల్లా విస్తరణ, మీడియా అధికారి (డీఈఎంఓ) వేముల అశోక్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని పలువురు అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు కొనియాడారు. ఆయన పదవీ విరమణ సందర్భంగా హనుమకొండలో ఘనంగా వీడ్కోలు, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎ.అప్పయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.అప్పయ్య మాట్లాడుతూ.. అశోక్‌రెడ్డి వైద్య ఆరోగ్య శాఖలో సుదీర్ఘకాలం అంకితభావంతో విధులు నిర్వర్తించారని తెలిపారు. ముఖ్యంగా సమాచారం, విద్య, కమ్యూనికేషన్ (ఐఈసీ) కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఆరోగ్య అవగాహన కల్పించడంలో ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ప్రజారోగ్య కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పిస్తూ ఆరోగ్య సందేశాలను ప్రజలకు చేరవేయడంలో అశోక్‌రెడ్డి కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జగన్మోహన్‌రావు మాట్లాడుతూ.. అశోక్‌రెడ్డి వైద్య ఆరోగ్య శాఖతో పాటు టీజీఓ అసోసియేషన్‌కు కూడా తన సేవలను అందించారని తెలిపారు. ముఖ్యంగా స్వాతంత్ర్య దినోత్సవం, రాష్ట్ర అవతరణ దినోత్సవం వంటి ముఖ్యమైన సందర్భాల్లో ప్రత్యేక శకటాలు రూపొందించడంలో ఆయన చూపిన సృజనాత్మకత, సమర్థవంతమైన ప్రణాళికా సామర్థ్యం ప్రశంసనీయమన్నారు. ప్రతి ఆరోగ్య కార్యక్రమం విజయవంతం కావడానికి ఆయన నిరంతరం కృషి చేశారని, తన అనుభవంతో తోటి ఉద్యోగులకు మార్గదర్శకంగా నిలిచారని తెలిపారు. జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఆకవరపు శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజారోగ్య విభాగంలో 41 సంవత్సరాల పాటు సేవలందించడం ఎంతో అభినందనీయమని అన్నారు. అశోక్‌రెడ్డి సేవా స్ఫూర్తిని ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పదవీ విరమణ అనంతరం ఆయన జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో కొనసాగాలని పలువురు ఆకాంక్షించారు. అనంతరం వేముల అశోక్‌రెడ్డిని ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సీహెచ్. రాజారెడ్డి, టీబీ హాస్పిటల్ ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ మదన్‌మోహన్, డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ రజిత, రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ జయకుమార్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జగన్మోహన్‌రావు, టీజీఓ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఆకవరం శ్రీనివాస్, కార్యదర్శి ప్రవీణ్, హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ మీడియా ఆఫీసర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నవాజ్‌ఖాన్, తెలంగాణ హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ మీడియా ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొప్పు ప్రసాద్, కార్యదర్శి కిరణ్, శ్రీనివాస్, రామాంజనేయులు, ఆంధ్రప్రదేశ్ హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ మీడియా ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగేశ్వరరావు, కార్యదర్శి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

# డబ్బులు ఇస్తేనే పెన్షన్ శాంక్షన్?

**పీహెచ్ వర్కర్‌గా ఉద్యోగంలో చేరిన వ్యక్తి ప్రస్తుతం బిల్ కలెక్టర్‌గా విధులు**
**పెన్షన్ నుంచి హౌస్ నెంబర్ వరకు**
**మున్సిపల్ పనులకు డబ్బులు ఇవ్వాల్సిందేనన్న ఆరోపణలు**





**వరంగల్, 31ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

మున్సిపల్ పరిధిలో పెన్షన్ శాంక్షన్ నుంచి హౌస్ నెంబర్ కేటాయింపు వరకు వివిధ పనులకు డబ్బులు ఇవ్వాల్సి వస్తోందంటూ స్థానికుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒకే డివిజన్‌లో కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఓ మున్సిపల్ ఉద్యోగిపై ఈ ఆరోపణలు వస్తున్నాయి. పీహెచ్ వర్కర్‌గా ఉద్యోగంలో చేరిన వ్యక్తి ప్రస్తుతం బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నప్పటికీ, డివిజన్‌లోని పలు కీలక వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. అంతేకాకుండా ఆర్ఐగా కూడా వ్యవహరిస్తున్నారంటూ కొందరు స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నట్లు సమాచారం. పెన్షన్ శాంక్షన్ చేయాలన్నా, హౌస్ నెంబర్ కేటాయించాలన్నా, ఇతర మున్సిపల్ పనులు పూర్తి చేయించుకోవాలన్నా డబ్బులు ఇవ్వాల్సిందేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. పైస్థాయి అధికారులకు ముడుపులు చెల్లిస్తూ పోస్టింగ్‌లు కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఏళ్ల తరబడి ఒకే డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్నప్పటికీ బదిలీ ఎందుకు జరగడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారికంగా ఒక పోస్టులో ఉన్నప్పటికీ డివిజన్‌లోని కీలక పనులన్నీ ఆయన కనుసన్నల్లోనే జరుగుతున్నాయన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ వ్యవహారంపై మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. ఆరోపణలు నిజమని విచారణలో తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే, ఈ ఆరోపణలపై సంబంధిత ఉద్యోగి, మున్సిపల్ అధికారులు తమ వివరణ ఇవ్వాల్సి ఉంది. విచారణ అనంతరం మాత్రమే ఆరోపణల్లో వాస్తవమెంత అన్నది స్పష్టమయ్యే అవకాశం ఉంది.

# ఇప్పటికీ 5 శాతం కులాంతర వివాహాలేనా?






### గణాంకాల వెనుక దాగిన కుల గోడల అసలు నిజం!

**అమరావతి, 31 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

కులాంతర వివాహం అంటే కేవలం ఇద్దరు వ్యక్తుల వివాహం కాదు.. అది తరతరాలుగా కొనసాగుతున్న కుల వ్యవస్థకు విసిరే ఒక సామాజిక సవాలు. విద్య, పట్టణీకరణ, ఆర్థికాభివృద్ధి పెరుగుతున్న కొద్దీ కుల వ్యవస్థ బలహీనపడుతోందని, కొత్త తరానికి కుల పట్టింపులు తగ్గుతున్నాయని తరచూ వినిపిస్తున్నప్పటికీ, అందుబాటులో ఉన్న సామాజిక పరిశోధనలు మాత్రం భారతీయ సమాజంలో కుల వ్యవస్థ ఇంకా బలమైన ప్రభావాన్ని కొనసాగిస్తోందని సూచిస్తున్నాయి. ఇండియా హ్యూమన్ డెవలప్‌మెంట్ సర్వే ఆధారంగా జరిగిన పరిశోధన ప్రకారం 2011--12 నాటికి భారతదేశంలో కులాంతర వివాహాలు సుమారు 5.82 శాతంగా నమోదయ్యాయి. అంటే అప్పటి గణాంకాల ప్రకారం 94 శాతానికి పైగా వివాహాలు తమ కుల పరిధిలోనే జరిగినట్లు అర్థమవుతోంది. అయితే ఈ 5.82 శాతాన్ని 2026 నాటికీ ఇదే శాతంగా భావించడం సరైంది కాదు. ప్రస్తుత పరిస్థితిని అంచనా వేయాలంటే తాజా, జాతీయ స్థాయి డేటా అవసరం. అలాగే కులాంతర వివాహాల గణాంకాల్లో ఉపకులాల మధ్య జరిగే వివాహాలు కూడా చేరే అవకాశం ఉన్నందున, ఈ సంఖ్య వెనుక ఉన్న సామాజిక దూరాన్ని కూడా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఒకే పాఠశాలలో చదువుకోవచ్చు.. ఒకే కళాశాలలో చదువుకోవచ్చు.. ఒకే సంస్థలో ఉద్యోగం చేయవచ్చు.. ఒకే అపార్ట్‌మెంట్‌లో నివసించవచ్చు. కానీ జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే సమయంలో మాత్రం "అతను ఏ కులం?", "ఆమె ఏ కులం?" అనే ప్రశ్నలు ముందుకు రావడం ఇప్పటికీ కనిపిస్తోంది. వివాహ ప్రకటనల్లో కులం, ఉపకులం, గోత్రం వంటి గుర్తింపులకు ప్రాధాన్యం ఇవ్వడం కూడా వివాహ వ్యవస్థలో కుల ప్రభావం ఇంకా కొనసాగుతోందనే విషయాన్ని స్పష్టం చేస్తోంది. అంటే ఆధునికత పెరిగినా వివాహం విషయంలో కుల గోడలు పూర్తిగా కూలిపోలేదన్నమాట. అయితే కులాంతర వివాహం అనే పదం వెనుక కూడా ఒకే రకమైన సామాజిక వాస్తవం ఉండదు. ఒకే విస్తృత సామాజిక వర్గానికి చెందిన రెండు ఉపకులాల మధ్య జరిగే వివాహం ఒక స్థాయి కుల సరిహద్దును దాటుతుంది. అదే సమయంలో సామాజికంగా అట్టడుగున ఉన్న కులానికి చెందిన వ్యక్తి, చారిత్రకంగా ఆధిపత్య స్థానంలో ఉన్న కులానికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకోవడం మరో స్థాయి సామాజిక గోడను సవాలు చేస్తుంది. కాబట్టి కేవలం సంఖ్యను చూడకుండా, ఆ వివాహాలు ఏ సామాజిక సరిహద్దులను దాటుతున్నాయో కూడా అధ్యయనం చేయాల్సి ఉంటుంది. కొన్ని పరిశోధనల్లో బ్రాహ్మణుల్లో కులాంతర వివాహాలు సుమారు 6.30 శాతం, ఇతర ఆధిపత్య కులాల్లో 6.20 శాతం, ఓబీసీల్లో 4.80 శాతం, ఎస్సీల్లో 4.76 శాతంగా నమోదైనట్లు పేర్కొనబడింది. అయితే ఈ గణాంకాల ఆధారంగా ఏదైనా ఒక కులాన్ని "అత్యంత ప్రగతిశీల కులం"గా ప్రకటించడం శాస్త్రీయంగా సరైంది కాదు. ముఖ్యంగా బ్రాహ్మణులు, ఇతర ఆధిపత్య కులాల మధ్య నమోదైన తేడా కేవలం 0.10 శాతం పాయింట్ మాత్రమే. అందువల్ల గణాంకాలను కులాల మధ్య పోటీ లేదా రాజకీయ ప్రచారానికి కాకుండా, భారతీయ సమాజంలో కుల వ్యవస్థ ఎలా కొనసాగుతోందో అర్థం చేసుకోవడానికి ఉపయోగించాలి. పట్టణీకరణ పెరిగినంత మాత్రాన కులం అంతరించిపోలేదని కూడా పరిశోధనలు సూచిస్తున్నాయి. నగరాల్లో వివిధ కులాలకు చెందిన ప్రజలు కలిసి చదువుకుంటున్నారు, ఉద్యోగాలు చేస్తున్నారు, కలిసి జీవిస్తున్నారు. కానీ వివాహం విషయానికి వచ్చేసరికి కుటుంబాలు తిరిగి తమ కుల నెట్‌వర్క్ వైపు మళ్లే పరిస్థితులు ఉన్నాయి. ఒకే నగరంలో నివసించడం వేరు.. కుల గోడలను దాటడం వేరు అనే వాస్తవం ఇక్కడ స్పష్టమవుతోంది. అలాగే ఆర్థికంగా ఎదగడం మాత్రమే కుల భావజాలాన్ని నిర్మూలించడానికి సరిపోదు. సంపద పెరిగినంత మాత్రాన కుల ఆధారిత వివాహ ప్రాధాన్యతలు స్వయంచాలకంగా మాయమవుతాయని చెప్పడానికి పరిశోధనలు పూర్తి మద్దతు ఇవ్వడం లేదు. కులం కేవలం ఆర్థిక వ్యవస్థలోనే కాకుండా కుటుంబం, బంధుత్వం, ఆస్తి, వారసత్వం, సామాజిక గౌరవం, రాజకీయ సంబంధాలు, వివాహ వ్యవస్థ వంటి అనేక అంశాలతో ముడిపడి ఉంది. ఈ నేపథ్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనలు అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంటాయి. అంబేద్కర్ కుల వ్యవస్థ నిర్మాణాన్ని విశ్లేషిస్తూ అంతర్వివాహం (ఎండోగమీ) కుల వ్యవస్థ కొనసాగడానికి కీలకమైన అంశమని గుర్తించారు. వివాహం కేవలం ఇద్దరు వ్యక్తులను కలపదు.. రెండు కుటుంబాలను, రెండు బంధుత్వ వలయాలను కలుపుతుంది. కులాల మధ్య వివాహ సంబంధాలు పెరిగితే మూసివేసిన కుల గోడలు బలహీనపడే అవకాశం ఉంటుంది. అందుకే కులాంతర వివాహం వ్యక్తిగత నిర్ణయమే కాకుండా కొన్ని సందర్భాల్లో కుల వ్యవస్థపై సామాజిక ప్రశ్నగా మారుతుంది. ఇద్దరు పెద్దలు పరస్పర అంగీకారంతో వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు వారి ఎంపికను కులం, కుటుంబ గౌరవం, సామాజిక ప్రతిష్ఠ పేరుతో అడ్డుకోవడం తీవ్రమైన సామాజిక సమస్య. కులాంతర వివాహాలను ఎంచుకున్న యువత కొన్ని సందర్భాల్లో కుటుంబ వ్యతిరేకత, సామాజిక ఒత్తిడి, బెదిరింపులు, బహిష్కరణ వంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఇది కేవలం కుటుంబ సమస్య కాదు.. వ్యక్తి స్వేచ్ఛ, సమానత్వం, గౌరవంతో ముడిపడిన అంశం. కులం పాఠశాలలో మాత్రమే ఉండదు.. ఉద్యోగంలో మాత్రమే ఉండదు.. రాజకీయాల్లో మాత్రమే ఉండదు. కుటుంబంలో, ముఖ్యంగా వివాహ వ్యవస్థలో తనను తాను పునరుత్పత్తి చేసుకుంటున్నంతకాలం కుల వ్యవస్థకు జీవం ఉంటుంది. అందువల్ల కుల నిర్మూలన గురించి మాట్లాడేటప్పుడు కేవలం చట్టాలు, రాజకీయాలు, రిజర్వేషన్ల గురించి మాత్రమే కాకుండా వివాహ వ్యవస్థలో కొనసాగుతున్న కుల ఆధిపత్యాన్ని కూడా ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. అయితే కులాంతర వివాహాల సంఖ్యను 5 శాతం నుంచి 10 శాతానికి పెంచడమే అంతిమ లక్ష్యం కాకూడదు. ఒక రోజు "కులాంతర వివాహం" అనే పదమే అవసరం లేని సమాజాన్ని నిర్మించడం అసలు లక్ష్యం కావాలి. అక్కడ పెళ్లి అనేది రెండు కులాల మధ్య ఒప్పందం కాదు.. ఇద్దరు మనుషుల స్వేచ్ఛాయుత నిర్ణయం. కుటుంబ గౌరవం పేరుతో కుల గౌరవాన్ని కాపాడాల్సిన అవసరం ఉండదు. వ్యక్తి విలువను కులం నిర్ణయించదు. కులాంతర వివాహం చేసుకున్న వారిని అభినందించడం మాత్రమే కాకుండా, వారి ఎంపికను గౌరవించే సామాజిక వాతావరణాన్ని నిర్మించాల్సిన బాధ్యత సమాజంపై ఉంది. అందుబాటులో ఉన్న గణాంకాలు కుల గోడలు ఇంకా పూర్తిగా కూలిపోలేదనే విషయాన్ని సూచిస్తున్నాయి. అయితే ఆ గోడలను ప్రశ్నించే ప్రతి అడుగు సామాజిక మార్పుకు నాంది కావచ్చు. పెళ్లి ఇద్దరు మనుషుల నిర్ణయం – రెండు కులాల ఒప్పందం కాదు. మనిషిని మనిషిగా చూడగలిగిన రోజే నిజమైన సామాజిక సమానత్వం ప్రారంభమవుతుంది. కుల గోడలు కూలాలి.. సమానత్వపు బంధాలు నిర్మించాలి.

## తల్లిదండ్రుల బాధ్యత వద్దనుకునే పిల్లలకు ఆస్తులు, అధికారాలు అడిగే హక్కు లేదు

### వృద్ధాప్యం ఎవరికీ శాపంగా మారకూడదు: సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి




**హన్మకొండ, 31 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

తల్లిదండ్రుల బాధ్యతలను విస్మరించే పిల్లలకు వారి ఆస్తులు, అధికారాలపై హక్కు కోరే నైతిక హక్కు లేదని సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్, అనురాగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. వృద్ధాప్యం ఎవరికీ శాపంగా మారకూడదని, వృద్ధులను గౌరవించడం, ప్రేమించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. హన్మకొండ భీమారం రోడ్డులోని కాకతీయ యూనివర్సిటీ సమీపంలో ఉన్న లార్డ్ వృద్ధాశ్రమాన్ని సోమవారం డాక్టర్ అనితా రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధులను ఆత్మీయంగా పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వృద్ధుల చట్టం, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు విధులు, వృద్ధులకు అందుబాటులో ఉన్న న్యాయ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ నిర్వాహకులు నాగరాణి నరేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయోవృద్ధులకు ట్రిబ్యునల్ బెంచ్ ఒక వరం లాంటిదన్నారు. వృద్ధులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా, కుటుంబ సభ్యుల నుంచి వేధింపులకు గురైనా ట్రిబ్యునల్‌ను సంప్రదించి న్యాయం పొందవచ్చని తెలిపారు. వృద్ధులను వేధించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని చెప్పారు. తల్లిదండ్రులు తమ జీవితకాలంలో తమ ఆస్తులను పూర్తిగా పిల్లలకు పంచివేయకుండా, వృద్ధాప్యంలో తమ అవసరాలకు కొంత ఆస్తిని తమ వద్ద ఉంచుకోవాలని డాక్టర్ అనితా రెడ్డి సూచించారు. తదనంతరం ఆస్తి వారసత్వం చెందేలా వీలునామా రాసుకోవడం మంచిదని తెలిపారు. తల్లిదండ్రుల బాధ్యతలను తీసుకోవడానికి ఇష్టపడని పిల్లలు మాత్రం వారి ఆస్తులు, అధికారాలను కోరడం సరికాదని అన్నారు. తల్లిదండ్రులను గౌరవించడం, ప్రేమించడం మన సంస్కారానికి నిదర్శనమని పేర్కొన్నారు. తల్లిదండ్రులను ప్రేమించకుండా, వారిని ఇబ్బందులకు గురిచేసే వారు ఎంతటి కోటీశ్వరులైనా విలువల పరంగా దరిద్రులతో సమానమని ఘాటుగా వ్యాఖ్యానించారు. తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ బాధ్యత పిల్లలదేనని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఆమె సూచించారు. వృద్ధులకు ఆత్మీయత, భద్రత, గౌరవం కల్పించేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డి, సంస్థ నిర్వాహకులు నాగరాణి నరేష్, వృద్ధాశ్రమంలోని వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల రాజకీయ సాధికారతకు తెలంగాణ ముందడుగు వేయాలి





దివ్యాంగుల మేధాశక్తిని పరీక్షించగల శక్తి ఎవరికీ ఉంది.
దివ్యాంగుల సంక్షేమ అభివృద్ధిని అడ్డుకుంటున్నారు.
కనీసం మౌలిక వస్తువులకు నోచుకోలేని దీనస్థితి దివ్యాంగులది.
దివ్యాంగుల హక్కులను అమలుపరిస్తే చాలు మేలు జరుగుతుంది.
ప్రజాసంక్షేమలో ప్రప్రదమైనది దివ్యాంగుల పరిరక్షణ హక్కులే.
సమాజంలో అత్యంత శక్తివంతమైన మేధా సంపన్నులంతా దివ్యాంగులే.
దివ్యాంగులను ఆదమరచడం అవివేకమే.
దేశ రాజకీయాలను శాసించిన దివంగత దివ్యంగానేత మాజీ కేంద్రమంత్రి జైపాల్ రెడ్డి.
దివ్యాంగ సమాజానికి హామీలు ఇచ్చి మోసగిస్తున్నారు.
కాంగ్రెస్ ప్రభుత్వానికి శక్తికి మించి సాయం చేసింది కేవలం దివ్యాంగులే.
మాట ఇవ్వడం దానిని నిలబెట్టుకోవడం కేవలం దివ్యాంగులకే సాధ్యవమౌతుంది.
సంక్షేమం నుంచి విధాన నిర్ణయాధికారం దిశగా మారాలి.
ప్రొఫెసర్ శ్రీనివాస రావు పెదమళ్ళ.

**వరంగల్, 31 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

దివ్యాంగుల రాజకీయ సాధికారతను కేవలం సంక్షేమ పథకాలకే పరిమితం చేయకుండా వారిని విధాన నిర్ణయ ప్రక్రియలో భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందని కాకతీయ విశ్వవిద్యాలయం ప్రజా పాలనా శాస్త్రం, మానవ వనరుల నిర్వహణ శాస్త్రం విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రీనివాస రావు పెదమళ్ళ అన్నారు. దివ్యాంగులను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా విధాన నిర్ణేతలుగా చూడాల్సిన సమయం ఆసన్నమైందని, రాజకీయ ప్రాతినిధ్యంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. భారత రాజ్యాంగం సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం వంటి విలువలకు ప్రాధాన్యత ఇస్తుందని, దివ్యాంగుల హక్కుల చట్టం--2016లోని సెక్షన్ 29 ప్రకారం రాజకీయాల్లో భాగస్వామ్య హక్కు ఉందని తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 15, 16, 326తో పాటు 73, 74వ రాజ్యాంగ సవరణలు స్థానిక పాలనలో ప్రజల భాగస్వామ్యానికి బలమైన చట్టపరమైన పునాదిని కల్పిస్తున్నాయని వివరించారు. ఎన్నికల సమయంలో ప్రతి ఓటు విలువైనదేనని రాజకీయ వ్యవస్థ చెబుతున్నప్పటికీ, దివ్యాంగులకు రాజకీయ పార్టీల నుంచి టికెట్లు ఇవ్వడం, నిర్ణయ కేంద్రాల్లో వారికి స్థానం కల్పించడం వంటి అంశాల్లో ఇంకా లోటు ఉందన్నారు. సంక్షేమ పథకాల జాబితాలో దివ్యాంగుల పేర్లు కనిపిస్తున్నప్పటికీ, విధాన నిర్ణయాలు తీసుకునే టేబుల్ దగ్గర వారికి కుర్చీ ఎందుకు ఉండదని ప్రశ్నించారు. దివ్యాంగుల కోసం మాత్రమే నిర్ణయాలు తీసుకునే విధానం నుంచి దివ్యాంగులతో కలిసి రాజకీయ, పరిపాలనా నిర్ణయాలు తీసుకునే కొత్త యుగం ప్రారంభం కావాలని ఆకాంక్షించారు. దేశంలో దివ్యాంగుల గురించి మాట్లాడినప్పుడు పెన్షన్, సహాయక పరికరాలు, స్కాలర్‌షిప్‌లు, ఉద్యోగ రిజర్వేషన్లు, ర్యాంపులు వంటి అంశాలే ప్రధానంగా చర్చకు వస్తున్నాయని, ఇవన్నీ అవసరమే అయినప్పటికీ శాసనసభలు, పార్లమెంట్, స్థానిక సంస్థలు, రాజకీయ పార్టీల నిర్ణయ కేంద్రాలు, ప్రభుత్వ నామినేటెడ్ సంస్థల్లో దివ్యాంగుల స్వరం ఎంతవరకు వినిపిస్తుందనే అంశంపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. సంక్షేమాన్ని స్వీకరించే పౌరుడిగా మాత్రమే కాకుండా సంక్షేమ విధానాలను రూపొందించే నాయకుడిగా దివ్యాంగులను చూడగలిగితేనే ప్రజాస్వామ్యం సంపూర్ణమవుతుందని తెలిపారు. దివ్యాంగత్వం రాజకీయ నాయకత్వానికి అడ్డంకి కాదని తెలంగాణ గడ్డ ఇప్పటికే దేశానికి చాటిచెప్పిందని ప్రొఫెసర్ శ్రీనివాస రావు పేర్కొన్నారు. చిన్ననాటే పోలియో ప్రభావంతో నడకలో తీవ్రమైన పరిమితి ఏర్పడి కర్రల సహాయంతో నడిచిన ఎస్. జైపాల్‌రెడ్డి ఎమ్మెల్యేగా, లోక్‌సభ సభ్యుడిగా, రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా అనేక కీలక బాధ్యతలు నిర్వహించారని గుర్తుచేశారు. శారీరక పరిమితి ఒక నాయకుడి మేధస్సును, వాక్చాతుర్యాన్ని, పరిపాలనా సామర్థ్యాన్ని నిర్ణయించదని ఆయన జీవితం నిరూపించిందన్నారు. ప్రపంచ రాజకీయ చరిత్రలోనూ పోలియో కారణంగా స్వతంత్రంగా నిలబడటం, నడవడం కష్టమైనప్పటికీ అమెరికా అధ్యక్షుడిగా ఫ్రాంక్లిన్ డి. రూజ్‌వెల్ట్ మహా మాంద్యం, రెండో ప్రపంచ యుద్ధం వంటి క్లిష్ట పరిస్థితుల్లో దేశాన్ని నడిపించారని, బ్రిటన్‌కు చెందిన డేవిడ్ బ్లంకెట్ జన్మతః దృష్టి లోపంతో ఉన్నప్పటికీ కీలక మంత్రిత్వ బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. దివ్యాంగత్వం నాయకత్వానికి వ్యతిరేక పదం కాదని, అవకాశాలు లేకపోవడమే అసలు అడ్డంకి అని అన్నారు. ఒక దివ్యాంగుడు ఓటు వేయగలిగితే అభ్యర్థిగా కూడా నిలబడగలడని, పార్టీని నడిపించగలడని, చట్టాలు రూపొందించగలడని, మంత్రిగా పరిపాలించగలడని ప్రొఫెసర్ శ్రీనివాస రావు అన్నారు. "మా కోసం నిర్ణయం" అనే రాజకీయ భాష "మాతో కలిసి నిర్ణయం"గా మారాలని సూచించారు. దివ్యాంగుల రోజువారీ సమస్యలను అనుభవించిన వ్యక్తులు శాసనసభల్లో ఉంటే ర్యాంప్ ఒక నిర్మాణ అంశంగా కాకుండా స్వేచ్ఛకు ప్రతీకగా కనిపిస్తుందని, బస్సులో ఎక్కలేని బాధ తెలిసిన నాయకుడికి సుగమ్య రవాణా కేవలం ఒక పథకం కాకుండా జీవన హక్కుగా కనిపిస్తుందని, స్క్రీన్ రీడర్ లేక పుస్తకం చదవలేని విద్యార్థి సమస్య తెలిసిన ప్రతినిధికి డిజిటల్ యాక్సెసిబిలిటీ కేవలం సాంకేతిక పదం కాకుండా విద్యా సమానత్వానికి సంబంధించిన అంశంగా కనిపిస్తుందని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న దివ్యాంగ అధ్యాపకులు, పరిశోధకులు, ప్రజా పాలనా శాస్త్ర నిపుణులు, సామాజిక శాస్త్రవేత్తలు, న్యాయ నిపుణులు, వైద్యులు, సాంకేతిక నిపుణులు, దివ్యాంగ సంఘాల ప్రతినిధులతో కలిసి "తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల సమగ్ర సాధికారత మరియు రాజకీయ ప్రాతినిధ్య కమిషన్" ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఈ కమిషన్ రాష్ట్ర విధానాల రూపకల్పన, చట్ట సవరణల సూచనలు, రాజకీయ ప్రాతినిధ్యం, విద్యా హక్కులు, ఉపాధి, యాక్సెసిబిలిటీ, సాంకేతిక సహాయం, స్థానిక సంస్థల్లో భాగస్వామ్యం వంటి అంశాలపై సమగ్రంగా పనిచేయాలని కోరారు. దివ్యాంగుడిగా జీవించిన అనుభవం ఒక జ్ఞానమైతే, అధ్యాపకుడిగా, పరిశోధకుడిగా సంపాదించిన పరిజ్ఞానం మరో జ్ఞానమని, ఈ రెండూ కలిసినప్పుడు విధాన నిర్ణయాలకు మరింత స్పష్టత వస్తుందని తెలిపారు. అందువల్ల విశ్వవిద్యాలయాల్లో అర్హత, అనుభవం కలిగిన దివ్యాంగ అధ్యాపకులను సభ్యులు, సలహాదారులు, అంశ నిపుణులుగా విధాన రూపకల్పనలో భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రతి జిల్లాలో దివ్యాంగుల విద్య, ఉపాధి, ఆరోగ్యం, రవాణా, డిజిటల్ యాక్సెస్, రాజకీయ భాగస్వామ్యంపై సమగ్ర డేటాను సేకరించాలని, ప్రభుత్వ భవనాలు, విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, బస్‌స్టేషన్లు, ఆసుపత్రులు, గ్రామపంచాయతీ కార్యాలయాల యాక్సెసిబిలిటీపై వార్షిక ఆడిట్ నిర్వహించాలని తెలిపారు. దివ్యాంగ యువతకు రాజకీయ నాయకత్వ శిక్షణ, పాలసీ ఫెలోషిప్‌లు, ఇంటర్న్‌షిప్‌లు, ప్రజా పరిపాలన శిక్షణ అందించాలని కోరారు. దివ్యాంగుల కోసం పథకాలు ప్రకటించడం మంచిదేనని, అయితే వారికి బడ్జెట్ కేటాయించడం కంటే బడ్జెట్ ఎలా కేటాయించాలో చెప్పే స్థానం కల్పించడం మరింత ముఖ్యమని అన్నారు. వారికి సహాయం చేయడం కంటే మరొకరికి సహాయం చేసే అధికారాన్ని ఇవ్వడమే నిజమైన సాధికారత అని పేర్కొన్నారు. దివ్యాంగుడిని "బెనిఫిషియరీ"గా కాకుండా "పాలసీ మేకర్"గా చూడగలిగితేనే సమాజంలో నిజమైన మార్పు వస్తుందని తెలిపారు. రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోల్లో దివ్యాంగుల సంక్షేమానికి ఒక పేరా రాయడంతో సరిపెట్టకుండా, తమ పార్టీ సంస్థాగత నిర్మాణంలోనూ వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ప్రొఫెసర్ శ్రీనివాస రావు కోరారు. మండల, జిల్లా, రాష్ట్ర కమిటీల్లో అర్హులైన దివ్యాంగులకు అవకాశాలు ఇవ్వాలని, స్థానిక సంస్థలు, శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజా సేవ, విద్య, నాయకత్వ సామర్థ్యం ఉన్న దివ్యాంగ అభ్యర్థులను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. ఇది రాజకీయ దానం కాదని, ప్రజాస్వామ్య న్యాయమని స్పష్టం చేశారు. దివ్యాంగులను చూసి "పాపం" అనడం సులభమని, "మీరు మా పాలసీ కమిటీలో ఉండాలి" అని ఆహ్వానించడం సమాజ పరిపక్వతకు నిదర్శనమని అన్నారు. వీల్‌చైర్‌కు దారి చేయడం మంచిదేనని, అయితే ఆ కుర్చీని నిర్ణయాల టేబుల్ దగ్గరకు తీసుకెళ్లడం ఇంకా గొప్ప విషయమని పేర్కొన్నారు. దేశం మొత్తానికి తెలంగాణ ఒక కొత్త సందేశం ఇవ్వాలని, "దివ్యాంగులను మేము చూసుకుంటాం" అనే స్థాయి నుంచి "దివ్యాంగులతో కలిసి మేము రాష్ట్రాన్ని నడుపుతాం" అనే స్థాయికి ఎదగాలని ప్రొఫెసర్ శ్రీనివాస రావు పిలుపునిచ్చారు. "దివ్యాంగులకు కేవలం ర్యాంప్ వద్దు---రాజ్యాధికారానికి దారి కావాలి. కేవలం సంక్షేమం వద్దు---విధాన నిర్ణయాధికారం కావాలి. ఆ మార్పుకు తెలంగాణే ముందడుగు వేయాలి" అని అన్నారు. ఒక రాష్ట్ర గొప్పతనం దివ్యాంగులకు ఎంత సహాయం చేసిందో మాత్రమే కాకుండా, వారిలో ఎంతమందిని నాయకులుగా ఎదగనిచ్చిందో చూసి కూడా కొలవాలని, తెలంగాణ ఈ దిశగా కొత్త చరిత్రను రాయగలదని, అందుకు రాజకీయ సంకల్పం అవసరమని ప్రొఫెసర్ శ్రీనివాస రావు పెదమళ్ళ పేర్కొన్నారు.

# ప్రజావాణికి అధికారులు ఆలస్యంగా..

**ఉదయం 9 గంటలకు హాజరు కావాల్సి ఉండగా 10 నుంచి 11 గంటల వరకు రాక..**

**కొందరు గైర్హాజరు.. కిందిస్థాయి సిబ్బందితో సరిపెట్టుకుంటున్నారనే ఆరోపణలు**



**హసన్‌పర్తి, 31 అగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహణపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రజావాణికి మండల స్థాయి అధికారులు నిర్ణీత సమయానికి హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉన్నప్పటికీ, కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా ఆలస్యంగా హాజరవుతున్నారని ప్రజలు గుసగుసలాడుతున్నారు. సోమవారం హసన్‌పర్తి మండల కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. అయితే ప్రజల నుంచి వచ్చిన ఆరోపణల ప్రకారం, ఉదయం 9 గంటలకే హాజరు కావాల్సిన అధికారులు కొందరు 10 గంటల నుంచి 11 గంటల మధ్యలో కార్యాలయానికి చేరుకున్నారని, మరికొందరు అధికారులు ప్రజావాణికి హాజరు కాకుండా తమ శాఖలకు చెందిన కిందిస్థాయి సిబ్బందిని పంపించి కార్యక్రమాన్ని ముగించేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రజావాణిని ఒక ముఖ్యమైన వేదికగా ఏర్పాటు చేసింది. మండల స్థాయిలోనే వివిధ శాఖల అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంది. అయితే అధికారులు నిర్ణీత సమయానికి హాజరుకాకపోతే ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలనే ప్రశ్న తలెత్తుతోంది. ముఖ్యంగా సంబంధిత శాఖకు చెందిన మండల స్థాయి అధికారి స్థానంలో కిందిస్థాయి సిబ్బంది మాత్రమే హాజరైతే, సమస్యపై నిర్ణయం తీసుకునే అధికారం వారికి లేకపోవడంతో దరఖాస్తుదారులు మరోసారి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 22 మంది మండల స్థాయి అధికారులు హాజరైనట్లు అధికారులు ప్రకటించారు. వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 11 దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో రెవెన్యూ శాఖకు 6, జీడబ్ల్యూఎంసీకి 2, విద్యుత్ శాఖకు 1, ఇరిగేషన్ శాఖకు 1, ఆర్అండ్‌బీ శాఖకు 1 దరఖాస్తు వచ్చినట్లు వెల్లడించారు. అయితే అధికారులు సమయపాలన పాటించకపోవడం, కొందరు గైర్హాజరు కావడం, వారి స్థానంలో కిందిస్థాయి సిబ్బందిని పంపించడం నిజమేనా? అనే అంశంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ప్రజావాణి నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, హాజరు సమయం, అధికారుల బాధ్యతలను కచ్చితంగా అమలు చేస్తేనే కార్యక్రమం ఉద్దేశం నెరవేరుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రజల సమస్యలు వినేందుకు ఏర్పాటు చేసిన ప్రజావాణిలోనే అధికారులు అందుబాటులో లేకపోతే.. సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు ఆకస్మికంగా ప్రజావాణి కార్యక్రమాలను పరిశీలించి, ఆలస్యంగా వచ్చే లేదా గైర్హాజరయ్యే అధికారులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# లారీని ఢీకొని ప్రమాదానికి గురైన కారు

**మంటలు చెలరేగడంతో డ్రైవర్ సజీవ దహనం**

**విశాఖపట్నం,ఆగస్ట్31(జై భీమ్ న్యూస్):**

విశాఖ జిల్లాలోని ఆనందపురం-పెందుర్తి సర్వీస్ రోడ్డులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గండిగుండం సత్తరువు కూడలి వద్ద ఓ కారు అదుపుతప్పి లారీని ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే కారులో మంటలు చెలరేగి క్షణాల్లోనే వాహనం పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న డ్రైవర్ మంటల్లో చిక్కుకుని సజీవ దహనమైనట్లు సమాచారం. ప్రమాద తీవ్రతకు కారు పూర్తిగా కాలిపోవడంతో ఘటనాస్థలంలో భయానక పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మంటలను అదుపులోకి తీసుకువచ్చి, ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. ఇదిలా ఉండగా.. ప్రమాదం అనంతరం లారీకి చిక్కుకున్న నంబర్ ప్లేట్ ఆధారంగా మృతుడి వివరాలను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ప్రమాదానికి గురైన కారు ఏ పరిస్థితుల్లో లారీని ఢీకొట్టిందనే విషయంపై కూడా దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరించి.. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు గుర్తింపు పక్రియను వేగవంతం చేస్తున్నారు.

# ప్రమాదానికి గురైన లారీ

**మంటలు చెలరేగడంతో తప్పించుకున్న డ్రైవర్**

**తిరుపతి,ఆగస్ట్31(జై భీమ్ న్యూస్):**

చంద్రగిరి మండలంలోని బాకరాపేట ఘాట్ రోడ్డులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మహారాష్ట్ర నుంచి తిరుపతి వైపు వెళ్లే లారీ మార్గమధ్యంలో ప్రమాదవశాత్తూ కొండను ఢీకొట్టడంతో మంటలు చెలరేగి అక్కడికక్కడే దగ్ధమైంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ త్రుటిలో తప్పించుకుని ప్రాణాలు నిలుపుకున్నారు. పైప్‌ల లోడ్‌తో ఓ లారీ మహారాష్ట్రలోని బరంపూర్ నుంచి తిరుపతి వైపు వెళ్తోంది. చంద్రగిరి సమీపంలోని బాకరాపేట ఘాట్ రోడ్డు వద్దకు చేరుకోగానే ప్రమాదవశాత్తూ కొండగుట్టను ఢీకొట్టింది. దీంతో లారీ ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ చాకచక్యంగా లారీ నుంచి బయటకు దూకారు. తర్వాత మంటలు వేగంగా వ్యాపించడంతో లారీ పూర్తిగా కాలిపోయింది. గమనించిన వాహనదారులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో వారు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే లారీ మంటల్లో పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనపై చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**రీ-సర్వేను వేగవంతం చేయాలి.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు గడువులోగా పూర్తి చేయాలి: మంత్రి పొంగులేటి**

**మహబూబాబాద్, 31 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూయజమానికి చట్టబద్ధమైన హక్కులు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార--పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భూ రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రైతుల భూ సమస్యలను ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం మహబూబాబాద్ ఐడీఓసీ కార్యాలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీలు కడియం కావ్య, పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు మురళీనాయక్, కడియం శ్రీహరి, యశస్వినిరెడ్డి, దొంతి మాధవరెడ్డి, కేఆర్ నాగరాజు, నాయని రాజేందర్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు తదితర ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ శాఖల కార్యదర్శులు లోకేష్‌కుమార్, రాజీవ్‌గాంధీ హనుమంతు, వి.పి. గౌతమ్‌లతో కలిసి మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో వరంగల్, హనుమకొండ, జనగామ, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, తహసీల్దార్లు, సర్వేయర్లు, హౌసింగ్, అటవీ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూ రీ-సర్వే పురోగతి, నాన్-కెడస్ట్రల్, కెడస్ట్రల్ గ్రామాల్లో సర్వే పనులు, లైసెన్స్‌డ్ సర్వేయర్ల పనితీరు, 22-ఏ భూములు, సాదా బైనామాలు, అటవీ--రెవెన్యూ భూముల సరిహద్దు వివాదాలు, భూభారతి చట్టం, రిజిస్ట్రేషన్ కార్యాలయాల నిర్మాణం, ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, రెండో విడత ఇళ్ల మంజూరు, ఇసుక కొరత తదితర అంశాలను సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా భూ రీ-సర్వేను ప్రాధాన్యతా అంశంగా తీసుకుని వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను లక్ష్యంగా ఎంపిక చేసి మొదటి విడత సర్వేను నవంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని, రెండో విడత సర్వేను వచ్చే ఏడాది మార్చి నాటికి చేపట్టి, రాబోయే ఏడాదిన్నరలో రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమిని శాస్త్రీయంగా సర్వే చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నాన్-కెడస్ట్రల్, కెడస్ట్రల్ గ్రామాల్లో జరుగుతున్న సర్వే పనుల పురోగతిని పరిశీలించిన మంత్రి, సర్వే విధులకు హాజరుకాని లైసెన్స్‌డ్ సర్వేయర్లకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయికి వెళ్లకుండా సర్టిఫికెట్లు జారీ చేయడం, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వంటి చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. 22-ఏ కింద ఉన్న భూములపై సర్వే నంబర్ల వారీగా వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలతో సమగ్ర నివేదికను రెండు రోజుల్లో సిద్ధం చేయాలని ఆదేశించారు. పొరపాటున 22-ఏ జాబితాలో చేరిన అర్హులైన రైతుల భూములను పరిశీలించి, వాటిని జాబితా నుంచి తొలగించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. భూభారతి ద్వారా ప్రజలకు పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందించాలని, సాదా బైనామాలు తదితర సమస్యలను పరిష్కరించి అర్హులైన రైతులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని తెలిపారు. అటవీ--రెవెన్యూ భూముల సరిహద్దు వివాదాలను సంయుక్త సర్వే ద్వారా శాశ్వతంగా పరిష్కరించాలని సూచించారు. రైతుల భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకూడదని, సర్వేతో సంబంధం లేని భూ సమస్యలను కూడా గుర్తించి పరిష్కరించాలని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షించిన మంత్రి, ఇప్పటివరకు ప్రభుత్వం సుమారు రూ.1,200 కోట్లు ఇందిరమ్మ ఇళ్ల కోసం ఖర్చు చేసిందని తెలిపారు. జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో ఇళ్ల నిర్మాణాల పురోగతి సంతృప్తికరంగా ఉందని, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో ఆశించిన స్థాయిలో లేదని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి సెప్టెంబర్ 15 నాటికి గరిష్ఠ సంఖ్యలో ఇళ్లను పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి 2,000 ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. గుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తాత్కాలిక పైకప్పులతో నివసిస్తున్న అర్హులైన కుటుంబాలకు రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకం కింద రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించనున్నట్లు వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచిత ఇసుక అందించే వ్యవస్థలో అక్రమ వసూళ్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. అదనపు రవాణా చార్జీల పేరుతో లబ్ధిదారుల నుంచి అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, రవాణా రేట్లను శాస్త్రీయంగా నిర్ణయించి సిస్టమ్‌లో నమోదు చేయాలని కలెక్టర్లకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ అత్యధికంగా గుడిసెలు ఉన్న ప్రాంతాలను గుర్తించి అర్హులైన పేదలకు అధిక సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఇల్లు నిర్మించుకునే స్తోమత లేని కుటుంబాలకు జర్మన్ టెక్నాలజీ వంటి ఆధునిక పద్ధతులతో ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాకారం ప్రాంతంలోని భూమి అటవీ శాఖకు చెందిందా, రెవెన్యూ శాఖకు చెందిందా అనే అంశంపై సర్వే నిర్వహించాలని, రెవెన్యూ భూమిగా గుర్తిస్తే అక్కడ పారిశ్రామిక ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ వరంగల్ జిల్లాలోని భద్రకాళి, చిన్నవడ్డేపల్లి తదితర చెరువుల భూములు ఆక్రమణలకు గురికాకుండా వాటి హద్దులను పక్కాగా నిర్ణయించాలని కోరారు. ఈస్ట్, వెస్ట్ నియోజకవర్గాల్లో హైదరాబాద్ తరహా టవర్స్ కాన్సెప్ట్‌ను పరిశీలించాలని హౌసింగ్ ఎండీ వి.పి. గౌతమ్‌ను సూచించారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత లేకుండా చూడాలని కోరారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఎన్టీఆర్ నగర్, సుందరయ్య నగర్ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ప్రభుత్వ భూముల్లో పట్టాలు ఇచ్చేలా, అవసరమైతే వారిని తగిన ప్రాంతానికి షిఫ్ట్ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరగా, దీనిపై తగిన చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్, హౌసింగ్ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్ణీత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.




# కామాంధుడి కిరాతకం.. నర్సును గొంతు నులిమి హత్య

**మృతదేహంపై అత్యాచారం చేసినట్లు అనుమానం.. తుక్కుగూడలో కలకలం**



**హైదరాబాద్, ఆగస్టు 31:**

హైదరాబాద్ నగర శివారులో దారుణ ఘటన వెలుగుచూసింది. విధులు ముగించుకుని విశ్రాంతి తీసుకుంటున్న ఓ నర్సును కామాంధుడు గొంతు నులిమి హత్య చేసిన ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తీవ్ర కలకలం రేపింది. అంతేకాకుండా నర్సు మృతదేహంపై కూడా అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలానికి చెందిన యువతి ఈ ఏడాది జనవరిలో తుక్కుగూడలోని ప్రైమ్‌కేర్ ఆస్పత్రిలో నర్సుగా విధుల్లో చేరింది. ఆస్పత్రికి సమీపంలోనే నర్సింగ్ సిబ్బంది విశ్రాంతి కోసం గదులను ఏర్పాటు చేశారు. అదే ప్రాంతంలోని ఓ మెకానిక్ షాపులో బిహార్‌కు చెందిన సైనా ఉల్లా (35) మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అతడి షాపు వెనుకవైపే నర్సుల విశ్రాంతి గదులు ఉండటంతో సిబ్బందిపై అతడి కన్ను పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. శుక్రవారం రాత్రి విధులు ముగించుకున్న నర్సు తన గదికి వెళ్లి విశ్రాంతి తీసుకుంటుండగా, మరో నర్సు విధుల్లో ఉండటంతో గదిలో ఆమె ఒక్కరే ఉన్న విషయాన్ని నిందితుడు గమనించినట్లు తెలుస్తోంది. విశ్రాంతి గది కిటికీలకు గ్రిల్స్ లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని సైనా ఉల్లా కిటికీ ద్వారా గదిలోకి ప్రవేశించినట్లు పోలీసులు భావిస్తున్నారు. గదిలోకి వచ్చిన నిందితుడిని చూసిన నర్సు భయంతో కేకలు వేస్తూ ప్రతిఘటించడంతో అతడు ఆమెపై దాడి చేసి గొంతు నులిమి హత్య చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. శనివారం మరో నర్సు సారిక గది వద్దకు వచ్చి తలుపు తట్టినా లోపలి నుంచి స్పందన లేకపోవడంతో ఆస్పత్రి యాజమాన్యానికి సమాచారం అందించింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని కిటికీ ద్వారా గదిలోకి వెళ్లి చూడగా నర్సు విగతజీవిగా పడి ఉంది. ఆమె ముఖం, కాళ్లపై గాయాలు కనిపించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. నర్సును హత్య చేసిన అనంతరం కూడా నిందితుడు మృతదేహంపై అత్యాచారానికి పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే ఈ విషయం పోస్టుమార్టం, ఫోరెన్సిక్ నివేదికలు వచ్చిన తర్వాతే నిర్ధారణ అవుతుందని అధికారులు తెలిపారు. రెండేళ్ల క్రితం కోల్‌కతాలోని ఆర్జీకర్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో జరిగిన వైద్య విద్యార్థిని హత్య ఘటనను ఈ ఉదంతం తలపిస్తోందని పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసులో దర్యాప్తు వేగవంతం చేసిన పోలీసులు నిందితుడు సైనా ఉల్లాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆస్పత్రి పరిసరాల్లోనే నర్సులకు రక్షణ లేకుండా పోవడం, విశ్రాంతి గదులకు సరైన భద్రతా ఏర్పాట్లు లేకపోవడం పట్ల సిబ్బంది, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# రాష్ట్రపతి భద్రతాధికారి రిషభ్ సింగ్ రాజీనామా

**వ్యక్తిగత కారణాలతోనే అంటూ ప్రచారం**

**న్యూఢిల్లీ,ఆగస్ట్31(జై భీమ్ న్యూస్):**

రాష్ట్రపతి 'ఎయిడ్-డి-క్యాంప్ మేజర్ రిషభ్ సింగ్ సాంబ్యాల్ అనూహ్య రాజీనామా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ద్రౌపదీ ముర్ము అధికారిక కార్యక్రమాలు, పర్యటనల్లో ఆమె పక్కన కనిపించే ఆర్మీ అధికారికి సోషల్ మీడియాలో క్రేజ్ ఉంది. తాజాగా ఆయన ముందస్తు పదవీ విరమణ చేయడం చర్చనీయాంశమైంది. 12 ఏళ్లపాటు సైన్యంలో పని చేసిన రిషభ్ వ్యక్తిగత కారణాలతో ఆర్మీని వీడినట్లు పేర్కొన్నారు. 32ఏళ్ల రిషభ్ 2014లో నేషనల్ డిఫెన్స్ అకాడమీ లో చేరారు. మిలిటరీ స్టడీస్, డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అభ్యసించారు. '4 పారా స్పెషల్ ఫోర్సెస్'లో పనిచేశారు. ఇందులో ప్రఖ్యాత 'బలిదాన్ బ్యాడ్జ్'ను పొందారు. 2021 గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో కెప్టెన్‌గా 'జాట్ రెజిమెంట్' దళానికి నాయకత్వం వహించారు. ఆ ఏడాది జాట్ రెజిమెంట్ ఉత్తమ మార్చింగ్ కంటింజెంట్ ట్రోఫీని గెలుచుకోవడంతో రిషభ్ సింగ్ పేరు మార్మోగింది. అనంతరం 2023లో ఆయన రాష్ట్రపతి ఏడీసీగా ఎంపికయ్యారు. అప్పటి నుంచి ఆయన కెరీర్ కీలక మలుపు తిరిగింది. రాష్ట్రపతి అధికారిక కార్యక్రమాల్లో తరచూ కన్పించడం, ప్రొటోకాల్‌ను అనుగుణంగా భద్రతా విధులను సమర్థంగా నిర్వర్తించడంతో ఆ మధ్య సామాజిక మాధ్యమాల్లో రిషభ్ వైరల్‌గా మారారు. నెటిజన్లు ఆయనకు 'నేషనల్ క్రష్' అనే ట్యాగ్‌ను కూడా ఇచ్చారు. ఇప్పుడు ఉన్నట్టుండి ఆయన పదవి నుంచి వైదొలగడం నెట్టింట చర్చకు దారితీసింది. అయితే, వ్యక్తిగత, కుటుంబపరమైన బాధ్యతల కారణంగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

# అదుపు తప్పి పలు వాహనాలనపు ఢీకొన్న ట్రక్కు

**ప్రమాదంలో నలుగురు అక్కడిక్కడే మృతి**

**న్యూఢిల్లీ,ఆగస్ట్31(జై భీమ్ న్యూస్):**

నొయిడా జిల్లాలోని జేవార్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా ప్రయాణిస్తున్న ట్రక్కు.. కారు సహా పలు వాహనాలను ఢీకొనడంతో నలుగురు మృతిచెందారు. నొయిడాలోని జేవార్ సమీపంలో యమునా రహదారిపైన ఓ ట్రక్కు అతివేగంగా ప్రయాణిస్తోంది. ఇంతలో అదుపుతప్పిన ట్రక్కు డివైడర్‌ను ఢీకొట్టి, అవతలి వైపు రోడ్డుమీదికి దూసుకెళ్లింది. అటువైపుగా వస్తున్న పలు వాహనాలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోగా.. పలువురు గాయపడినట్టు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# ఆకస్మిక తనిఖీలపై ఆంతర్యమేమిటి?

**జిల్లా రెవెన్యూ శాఖలో అక్రమాలకు చెక్ పెడుతున్న కలెక్టర్**

**రెవెన్యూ అక్రమార్కులపై హనుమకొండ జిల్లా కలెక్టర్ కు నేరుగా విన్నవించుకుంటున్న బాధితులు**

**పైసల వసూళ్లకు పాల్పడుతున్న రెవెన్యూ అధికారుల భారతం పట్టాల్సిందే**

**భూ దందాల్లో భూ కబ్జాలో తలదొరుస్తూ తప్పుడు నివేదికలు సిద్ధపరుస్తున్నారని తీవ్ర విమర్శలు**

**రెవెన్యూ శాఖ బలోపేతానికి జిల్లా కలెక్టర్ పూర్తి బాధ్యత వహిస్తున్నారు**

**ప్రజావాణి ఫిర్యాదులపై సీరియస్ యాక్షన్.. ఆకస్మిక తనిఖీలతో అధికారుల్లో కలవరం**

**తప్పుడు పత్రాల తయారీ ఎవరి కనుసన్నల్లో?**

**ప్రభుత్వ భూముల కబ్జాల వెనుక అసలు కారకులెవరు?**

**హన్మకొండ, 31 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాల్సిన రెవెన్యూ శాఖలో చోటుచేసుకుంటున్నట్లు వస్తున్న ఆరోపణలు జిల్లా యంత్రాంగం దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా ప్రజావాణి కార్యక్రమంలో వరుసగా అందుతున్న వినతిపత్రాలు, భూ వివాదాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, రెవెన్యూ రికార్డుల వ్యవహారాలు, తప్పుడు పత్రాల తయారీ, దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం, అధికారులు ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ ఫిర్యాదులపై సత్వరం స్పందించి వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు ఉన్నతాధికారులు మండల, తహసీల్దార్ కార్యాలయాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ప్రజావాణిలో ప్రజలు సమర్పించే వినతిపత్రాలు కేవలం స్వీకరణకే పరిమితం కాకుండా వాటిపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన ఫిర్యాదుల్లో నిర్లక్ష్యం, అనవసర జాప్యం, నిబంధనలకు విరుద్ధమైన వ్యవహారాలు లేదా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు ఉంటే వాటిపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉంది. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు ఆధారంగా సంబంధిత కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించడం ద్వారా ఫిర్యాదులో వాస్తవం ఎంతవరకు ఉందో తెలుసుకునే అవకాశం ఉంటుంది. మండల స్థాయి రెవెన్యూ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా? ప్రజలకు అందాల్సిన సేవలు సకాలంలో అందుతున్నాయా? నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు కారణాలేమిటి? ఒక చిన్న పని కోసం ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నది ఎవరు? మధ్యవర్తుల ప్రమేయం ఎంతవరకు ఉంది? ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులు ఏ విధంగా పరిష్కరిస్తున్నారు? అనే అంశాలను ఆకస్మిక తనిఖీల్లో పరిశీలిస్తే అసలు పరిస్థితులు బయటపడే అవకాశం ఉంది. కార్యాలయాల్లో ఫైళ్లు, రికార్డులు, పెండింగ్ దరఖాస్తులు, ధ్రువపత్రాల జారీ ప్రక్రియ, అధికారుల హాజరు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ఇక రెవెన్యూ కార్యాలయాల్లో తయారవుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న తప్పుడు పత్రాల వ్యవహారం మరింత కీలకంగా మారుతోంది. ఒక పత్రం తప్పుడు పద్ధతిలో తయారైతే దాని వెనుక కేవలం దరఖాస్తుదారుడి పాత్రే ఉందా? లేక మధ్యవర్తులు, కార్యాలయ సిబ్బంది లేదా సంబంధిత అధికారుల సహకారం ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తప్పుడు పత్రం తయారైన సందర్భంలో దాని మూలాలను గుర్తించడంతో పాటు, ఎవరు తయారు చేశారు? ఎవరు పరిశీలించారు? ఎవరి సంతకాలు ఉన్నాయి? ఏ అధికారి దాన్ని ధ్రువీకరించారు? అనే అంశాలపై విచారణ జరగాల్సిన అవసరం ఉంది. ఒకవేళ రికార్డుల్లో తారుమారు జరిగినట్లు తేలితే దానికి బాధ్యులైన ప్రతి ఒక్కరి పాత్రను బయటకు తీయాల్సిన అవసరం ఉంది. మరోవైపు ప్రభుత్వ భూములు కబ్జాల పాలవుతున్నాయని, విలువైన ప్రభుత్వ స్థలాలను కొందరు ఆక్రమించుకుంటున్నారని, వాటి పరిరక్షణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని జిల్లా కలెక్టర్ దృష్టికి ప్రజావాణి ద్వారా వినతిపత్రాలు అందుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ భూముల విషయంలో కేవలం రికార్డులను పరిశీలించడం కాకుండా క్షేత్రస్థాయిలో భౌతిక పరిశీలన నిర్వహించి రికార్డులు, వాస్తవ పరిస్థితులను సరిపోల్చాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు తేలితే ఆక్రమణదారులతో పాటు, దాన్ని అడ్డుకోవడంలో విఫలమైన అధికారులు ఎవరైనా ఉన్నారా? గతంలో ఫిర్యాదులు వచ్చినప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోలేదు? అనే అంశాలను కూడా పరిశీలిస్తే అసలు బాధ్యులు ఎవరో తేలే అవకాశం ఉంది. ప్రభుత్వ భూముల ఆక్రమణలు, రెవెన్యూ రికార్డుల అక్రమాలు, తప్పుడు పత్రాల వ్యవహారాలపై ప్రత్యేక దృష్టి సారించే స్పెషల్ టాస్క్‌ఫోర్స్ కమిటీ ఎప్పుడు పూర్తిస్థాయిలో రంగంలోకి దిగుతుందన్న ప్రశ్న కూడా ప్రజల్లో వినిపిస్తోంది. ఇప్పటివరకు అందిన ఫిర్యాదులపై ఎలాంటి విచారణ జరిగింది? ఎన్ని అక్రమాలు గుర్తించారు? ఎన్ని కేసుల్లో చర్యలు తీసుకున్నారు? బాధ్యులుగా గుర్తించిన అధికారులపై ఎలాంటి శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు? అనే వివరాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు ఉద్దేశం కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ఫలితాలు చూపాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు సేవ చేయాల్సిన అధికారులు వారినే ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు నిజమైతే వాటిపై జిల్లా యంత్రాంగం కఠినంగా స్పందించాల్సిన అవసరం ఉంది. విధుల్లో నిర్లక్ష్యం వహించడం, దరఖాస్తులను అనవసరంగా పెండింగ్‌లో ఉంచడం, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం, ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పడం వంటి ఆరోపణలపై వాస్తవాలను నిర్ధారించి చర్యలు తీసుకోవాలి. అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు ఎవరైనా విచారణలో తప్పు చేసినట్లు తేలితే శాఖాపరమైన చర్యలు తప్పవనే స్పష్టమైన సంకేతం క్షేత్రస్థాయికి వెళ్లాల్సిన అవసరం ఉంది. అప్పుడే అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసే పరిస్థితి ఏర్పడుతుందని ప్రజలు అంటున్నారు. జిల్లా కలెక్టర్ నిర్వహిస్తున్న ఆకస్మిక తనిఖీల అసలు ఆంతర్యం ఏమిటన్నది ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. ఇవి కేవలం కార్యాలయాల్లో రికార్డుల పరిశీలనకే పరిమితమవుతాయా? లేక ప్రజావాణిలో వస్తున్న ఫిర్యాదుల ఆధారంగా రెవెన్యూ శాఖలోని లోపాలను గుర్తించి, అవకతవకలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకునే ప్రక్రియకు శ్రీకారం చుట్టారా? అన్నది తేలాల్సి ఉంది. ఆకస్మిక తనిఖీల్లో బయటపడే ప్రతి అంశాన్ని లోతుగా పరిశీలించి, ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు వ్యవస్థలోని లోపాలను సరిదిద్దితేనే ఈ తనిఖీలకు పూర్తి అర్థం వస్తుందని ప్రజలు కోరుతున్నారు. ప్రజల భూములు, ప్రభుత్వ భూములు, రెవెన్యూ రికార్డులు ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అత్యంత కీలక అంశాలు కావడంతో వీటిలో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరి. తప్పుడు పత్రాల తయారీ వెనుక అసలు కారకులు ఎవరు? ప్రభుత్వ భూముల కబ్జాలకు అండగా నిలుస్తున్నది ఎవరు? రికార్డుల మార్పుల వెనుక ఎవరి పాత్ర ఉంది? మధ్యవర్తుల వ్యవస్థకు ఎవరు సహకరిస్తున్నారు? ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నది ఎవరు? ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై అధికారులు ఎంతమేరకు చర్యలు తీసుకుంటున్నారు? మండల స్థాయి కార్యాలయాల్లో అవినీతికి అడ్డుకట్ట ఎప్పుడు పడుతుంది? అనే ప్రశ్నలకు ఇక జిల్లా యంత్రాంగం చేపట్టే చర్యలే సమాధానం చెప్పాల్సి ఉంది.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీలకు కొనసాగింపు ఇచ్చి, ప్రజావాణి ఫిర్యాదులపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, తప్పిదాలు నిర్ధారణైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటే "రెవెన్యూ కార్యాలయాల్లో అక్రమాలకు చోటు లేదు.. ప్రజలను వేధిస్తే శిక్ష తప్పదు" అనే స్పష్టమైన సందేశం అధికార యంత్రాంగానికి వెళ్లే అవకాశం ఉంది. అదే సమయంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ, రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన, తప్పుడు పత్రాల తయారీపై విచారణ, ప్రజలకు సత్వర సేవలు అందించడం వంటి అంశాల్లో కఠిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఇక చూడాల్సింది ఒక్కటే.. ఆకస్మిక తనిఖీలు హెచ్చరికలకే పరిమితమవుతాయా? లేక రెవెన్యూ వ్యవస్థలో పేరుకుపోయిన అక్రమాల మూలాలను బయటకు తీసి, బాధ్యుల భరతం పడతారా?




# జయగిరి గ్రామంలో ఘనంగా సివిల్ రైట్స్ డే నిర్వహణ

**పౌర హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించిన అధికారులు**

**సమానత్వం, సామాజిక న్యాయ పరిరక్షణపై ప్రత్యేకంగా వివరించిన తహసీల్దార్ కిరణ్ కుమార్**



**హసన్‌పర్తి, 31 ఆగస్టు 31, 2026 (జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి మండలం జయగిరి గ్రామంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరుల హక్కులు, రాజ్యాంగం కల్పించిన రక్షణ, సమానత్వం, సామాజిక న్యాయం, వివక్ష నిర్మూలన తదితర అంశాలపై గ్రామస్థులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ప్రతి పౌరుడు తన హక్కులను తెలుసుకోవడంతో పాటు తన బాధ్యతలను కూడా గుర్తించి చట్టాలను గౌరవించాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశంలోని ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛ, గౌరవంతో జీవించే అవకాశాన్ని కల్పించిందన్నారు. కులం, మతం, ప్రాంతం, లింగం తదితర అంశాల ఆధారంగా ఎలాంటి వివక్షకు తావులేకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజలు తమ హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉంటే అన్యాయాలను ధైర్యంగా ఎదుర్కొని చట్టపరంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఆర్ఐ ఫాజిల్ మాట్లాడుతూ భూమి, రెవెన్యూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర ప్రభుత్వ సేవలకు సంబంధించి ప్రజలకు ఎదురయ్యే సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి చట్టపరమైన పరిష్కారం పొందవచ్చని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అందుబాటులో ఉన్న చట్టపరమైన మార్గాలను వినియోగించుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి రవీందర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో పౌర హక్కులపై అవగాహన పెంచడం ఎంతో అవసరమన్నారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు సమానంగా అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రజలు తమ హక్కులతో పాటు సామాజిక బాధ్యతలను కూడా గుర్తించి గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. గ్రామ సర్పంచ్ తాళ్లపెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పౌర హక్కుల పరిరక్షణ ప్రభుత్వ బాధ్యతతో పాటు ప్రజల బాధ్యత కూడా అని పేర్కొన్నారు. ఒకరి హక్కులను మరొకరు గౌరవిస్తూ గ్రామంలో ఐక్యత, సోదరభావం, సామాజిక సమానత్వాన్ని పెంపొందించాలని కోరారు. కార్యక్రమంలో రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, చట్టపరమైన రక్షణ, సామాజిక న్యాయం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివక్షకు వ్యతిరేకంగా ఉన్న చట్టపరమైన నిబంధనలపై ప్రజలకు వివరించారు. ఎవరైనా వివక్షకు గురైనా, తమ హక్కులకు భంగం కలిగినా సంబంధిత అధికారులను సంప్రదించి ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంచడం ద్వారా హక్కుల పరిరక్షణతో పాటు సామాజిక న్యాయాన్ని మరింత బలోపేతం చేయవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు తమ సమస్యలు, సందేహాలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిపై అధికారులు తగిన సూచనలు, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. సివిల్ రైట్స్ డే సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమం గ్రామస్థుల్లో పౌర హక్కులు, చట్టపరమైన రక్షణపై మరింత చైతన్యాన్ని కలిగించింది.

# దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిస్తే సహించేది లేదు

**మహేంద్ర భట్‌పై ఎస్సీ-ఎస్టీ చట్టం కింద చర్యలు తీసుకోవాలి**

**వరంగల్ సీపీ శ్వేతకు వినతిపత్రం అందజేసిన కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్**



**వరంగల్, 31 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న సభ అనంతరం నిర్వహించినట్లు వెల్లడైన "శుద్ధీకరణ" హవన్ వివాదంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆగస్టు 8న హల్ద్వానీలోని రామ్‌లీలా మైదానంలో మల్లికార్జున ఖర్గే బహిరంగ సభలో పాల్గొన్నారని, అనంతరం ఆగస్టు 10న అదే ప్రదేశంలో "శుద్ధీకరణ" పేరుతో హవన్ నిర్వహించినట్లు వార్తా కథనాలు వెల్లడించాయని తెలిపారు. ఈ ఘటనను ఖర్గే తనను దళితుడిగా అవమానించే చర్యగా అభివర్ణించారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉత్తరాఖండ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మహేంద్ర భట్ చేసిన వ్యాఖ్యలు వివాదానికి మరింత ఆజ్యం పోశాయని శ్రీనివాస్ అన్నారు. రామ్‌లీలా మైదానం కొన్ని నినాదాలతో "కలుషితమైందని", అందుకే శుద్ధీకరణ నిర్వహించాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నట్లు వార్తలు వచ్చాయని తెలిపారు. కుల వివక్ష, అంటరానితనాన్ని సమర్థించే లేదా ప్రోత్సహించే విధంగా ఎవరైనా వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని శ్రీనివాస్ అన్నారు. "రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వ హక్కును కల్పించింది. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే హక్కు ఎవరికీ లేదు. రాజకీయ భేదాభిప్రాయాలు ఉండవచ్చు కానీ కుల వివక్షను ప్రోత్సహించే చర్యలను సహించేది లేదు" అని స్పష్టం చేశారు. మహేంద్ర భట్‌పై వచ్చిన ఆరోపణలు, ఆయన చేసిన వ్యాఖ్యలు, హల్ద్వానీ ఘటనకు సంబంధించిన పూర్తి అంశాలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, ఎస్సీ--ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టంలోని వర్తించే నిబంధనలను పరిశీలించి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. దళితుల గౌరవం, హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ ఎస్సీ సెల్ నిరంతరం పోరాడుతుందని శ్రీనివాస్ పేర్కొన్నారు. అవసరమైతే దళితులపై వివక్షకు వ్యతిరేకంగా చట్టపరమైన అన్ని మార్గాల్లో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ, హనుమకొండ జిల్లా చైర్మన్ ఆరూరి సాంబయ్యతో పాటు జిల్లా బాధ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సెంచరీతో సత్తా చాటిన డీజీపీ సీవీ ఆనంద్

**సి-డివిజన్ వన్డే లీగ్ ఛాంపియన్‌షిప్‌లో అదరగొట్టిన తెలంగాణ డీజీపీ**

**హైద్రాబాద్, 31 ఆగస్టు 2026(జై భీమ్ న్యూ)**



విధి నిర్వహణలో పోలీస్ శాఖకు నాయకత్వం వహిస్తూ నిత్యం బిజీగా ఉండే తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ క్రీడా మైదానంలోనూ తన ప్రతిభను చాటుకున్నారు. సి-డివిజన్ వన్డే లీగ్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా హైదరాబాద్ జిల్లాతో జరిగిన మ్యాచ్‌లో సికింద్రాబాద్ క్లబ్ తరఫున బరిలోకి దిగిన సీవీ ఆనంద్ అద్భుతమైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నారు. సికింద్రాబాద్ క్లబ్ తరఫున ఓపెనర్‌గా బ్యాటింగ్‌కు దిగిన సీవీ ఆనంద్ 126 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. ఆరంభం నుంచే ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేసిన ఆయన హైదరాబాద్ జిల్లా బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. కీలక సమయంలో వికెట్ కోల్పోకుండా క్రీజులో నిలదొక్కుకుని జట్టుకు భారీ స్కోర్ అందించడంలో తన వంతు పాత్ర పోషించారు. సెంచరీ పూర్తి చేసిన అనంతరం కూడా అదే దూకుడును కొనసాగించిన సీవీ ఆనంద్ చివరి వరకు క్రీజులో నిలిచి 126 పరుగులతో అజేయంగా నిలవడం విశేషం. ఆయన ఇన్నింగ్స్‌తో సికింద్రాబాద్ క్లబ్ శిబిరంలో ఉత్సాహం నెలకొంది. మ్యాచ్‌లో ఆయన బ్యాటింగ్ ప్రదర్శన క్రికెట్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. పోలీస్ శాఖలో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ పరిపాలన, శాంతిభద్రతల పర్యవేక్షణలో నిరంతరం నిమగ్నమై ఉండే సీవీ ఆనంద్‌కు క్రికెట్‌పై ఉన్న ఆసక్తి కూడా తెలిసిందే. సమయం దొరికినప్పుడల్లా క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ, ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూ వస్తున్న ఆయన లీగ్ క్రికెట్‌లోనూ చురుకుగా పాల్గొంటున్నారు. డీజీపీగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే క్రికెట్ మైదానంలో ఓపెనర్‌గా బరిలోకి దిగి సెంచరీ సాధించడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. 126 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టుకు కీలక ఇన్నింగ్స్ అందించిన సీవీ ఆనంద్‌ను సహచర ఆటగాళ్లు, క్రీడాభిమానులు అభినందించారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు క్రీడలపై ఆసక్తిని కొనసాగిస్తూ ఇతరులకు సైతం స్ఫూర్తిగా నిలుస్తున్నారని పలువురు పేర్కొన్నారు. సీవీ ఆనంద్ సాధించిన ఈ శతకం ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పోలీస్ అధికారిగా కఠినమైన బాధ్యతలు నిర్వహిస్తూ, క్రీడా మైదానంలోనూ అదే పట్టుదల, ఏకాగ్రతతో రాణించడం అభినందనీయమని పలువురు ప్రశంసిస్తున్నారు.

